

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.120	180	200
సూర్యాపేట	రూ.95	140	170
నల్లగొండ	రూ.100	145	180

ఉష్ణోగ్రత గరిష్ఠం 37.0 । కనిష్ఠం 20.0

ఉగాది నుంచి సన్నబియ్యం

మట్టపల్లిలో సమీక్షా సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లిలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మఠంపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినం రోజు నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ ఒక్కరికి ఆరు కిలోల చొప్పున నాణ్యమైన సన్నబియ్యం ఉచితంగా ఇస్తామని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామిని మంత్రి ఉత్తమ్, కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్, మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిలతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో ధర్మకర్తలు వారికి స్వాగతం పలికారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనం చేసి స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు. అనంతరం మట్టపల్లి ఆర్యవైశ్య సత్రంలో మంత్రి ఉత్తమ్ సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రముఖ పుణ్యక్షేత్రం మట్టపల్లి నుంచి రాష్ట్రంలోని 84శాతం జనాభా కు నాణ్యమైన సన్న బియ్యం ఇచ్చే పవిత్ర కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించామన్నారు. గతంలో రేషన్ దుకాణాల ద్వారా పంపిణీచేసిన బియ్యాన్ని ప్రజలు తినకుండా రూ.5కే కోళ్లఫాం, మిల్లర్లకు విక్రయించేవారన్నారు. రేషన్ బియ్యం పంపిణీ దుర్వినియోగాన్ని గుర్తించి నిరుపేదల ఆకలి తీర్చేందుకు సన్న బియ్యం ఇచ్చి విప్లవాత్మక మార్పు తీసుకువస్తున్నామన్నారు. ప్రజా ప్రభుత్వం ఎన్నికైన మొదటి రోజు నుంచే ప్రజలకు ఉపయోగపడే అద్భుత పాలన అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ, ఎస్పీ నరసింహ, అదనపు కలెక్టర్ పి.రాంబాబు, ఆర్డీవో శ్రీనివాసులు, ఈవో నవీన్, తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేట జిల్లా కేంద్రంలో మాట్లాడుతున్న కేటీఆర్

నీళ్ల మంత్రి ఉన్నా.. చుక్కనీరు తేకపోవడం

సిగ్గుచేటు



- కేసీఆర్‌పై కోపంతోనే కాళేశ్వరాన్ని ఖాళీ చేశారు
- ప్రాజెక్టుల్లో నీళ్లు ఉన్నా చెరువులు నింపని కాంగ్రెస్
- వరంగల్ సభకు లక్షలాదిగా తరలిరావాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సూర్యాపేట(కలెక్టరేట్), మార్చి 20, (ఆంధ్రజ్యోతి): నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందినా, రైతులకు చుక్కనీరు తేలేకపోయారని, రాష్ట్రంలో ప్రస్తుతం నీళ్ల లేక పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువని, కేవలం కేసీఆర్‌పై కోపంతో కావాలనే కాళేశ్వరాన్ని ఖాళీ చేసి రైతులకు నీళ్లు ఇవ్వకుండా పంటలు ఎండిపోయేలా చేశారని అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాజెక్టుల్లో నీళ్లు ఉన్నా పంటలకు నీళ్లు ఇవ్వలేదని విమర్శించారు. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో మిగతా 7వ పేజీలో...

చరిత్రలో నిలిచే బడ్జెట్


నల్లగొండలో విలేకరుల సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్లగొండ జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్రపవార్

నల్లగొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ చరిత్రలో నిలిచిపోయేదిగా ఉందని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీశాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. అందరికీ ప్రభుత్వ ఫలాలు అందించేలా బడ్జెట్ ఉందన్నారు. ఇరిగేషన్‌కు పెద్దపీటవేశారని, అందులో నల్లగొండ జిల్లాకు ప్రాధాన్యం దక్కిందన్నారు. జిల్లాలో ఈ యాసంగిలో లక్ష ఎకరాల ఆయకట్టు పెరిగిందని, ధాన్యం దిగుబడి పెరగనున్నందున రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేస్తామన్నారు. బ్రాహ్మణవెల్లంలకు బడ్జెట్లో రెండింతలు నిధులు పెంచారని, రిజర్వాయర్‌లో నీళ్ల నింపడం ద్వారా భూగర్భ జలాలు పెరిగాయన్నారు. కాల్వలు, ప్రాజెక్టు పనుల పూర్తికి రూ.కోట్లు విడుదల చేశారని, డిసెంబరు నాటికి లక్ష ఎకరాలకు నీరివ్వాలన్న లక్ష్యాన్ని పూర్తిచేస్తామన్నారు. ఎస్ఎల్‌బీసీ ప్రమాదం జరిగి ఎనిమిది మంది మృతిచెందడం బాధాకరమన్నారు. రూ.11వేల కోట్లతో 58 ఇంటిగ్రేటెడ్ పాఠశాలు ఒక్కొక్కటి రూ.200కోట్లతో నిర్మిస్తున్నామన్నారు. వృత్తి విద్య, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఏటీసీలను మంజూరు చేశామని, నల్లగొండలో రూ.75కోట్లతో నిర్మించిన ఏటీసీలు సిద్ధంగా ఉన్నాయన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు స్కిల్ యూనివర్సిటీలతోపాటు జాబ్ మేళాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆర్ అండ్‌బీ ఆధ్వర్యంలో రూ.5,900 కోట్లతో 12,000కిలోమీటర్ల మిగతా 7వ పేజీలో...

ధాన్యం కొనుగోళ్లకు రంగం సిద్ధం



- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,053 కేంద్రాలు
- సన్నధాన్యానికి ప్రత్యేక కోనుగోలు కేంద్రాలు
- 26.76లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం

నల్లగొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు రంగం సిద్ధమవుతోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈ సీజన్‌లో దొడ్డురకాల ధాన్యంతో పాటు, సన్నరకాలను కూడా ప్రభుత్వరంగ సంస్థల ద్వారా కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ముందస్తుగా బోరుబావుల కింద సాగుచేసిన వరి కోతలు మొదలవడంతో ధాన్యం మిల్లులకు వస్తోంది. మరోవైపు నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లోని నాగార్జున సాగర్ ఆయకట్టు ప్రాంతాల్లో ఇప్పుడిప్పుడే కోతలు ప్రారంభమవగా, ఏప్రిల్ రెండోవారం నుంచి ముమ్మరమవనున్నాయి. సూర్యాపేట జిల్లాలోని ఎస్ఆర్ఎస్పీ ఆయకట్టు కింద కూడా దాదాపు ఇదే పరిస్థితి ఉంది. మరోవైపు యాదాద్రి, సూర్యాపేట జిల్లాల్లోని మూసీ ఆయకట్టు ప్రాంతాల్లో ఏప్రిల్ మొదటివారం నుంచి కోతలకు ప్రారంభమయ్యే అవకాశముందని అంచనా. ఉమ్మడి జిల్లాలో ఈ సీజన్‌లో 12.85 లక్షల ఎకరాల్లో యాసంగి వరి సాగుకాగా, సుమారు 29.19లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేసిన అధికార యంత్రాంగం అందుకు 1,053 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

సన్నధాన్యం కొనుగోలకు ప్రత్యేక కేంద్రాలు

ఉగాది నుంచి రేషన్‌కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో ప్రభుత్వం యాసంగిలోనూ సన్నధాన్యం సాగుచేయాలని రైతులను కోరింది. అందుకు ప్రోత్సాహకంగా యాసంగిలోనూ సన్నధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, అక్కడ ధాన్యం విక్రయించిన రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో యాసంగిలోనూ సన్నరకాల సాగు గణనీయంగా జరిగింది. నల్లగొండ జిల్లాలో 2.55లక్షల ఎకరాల్లో, సూర్యాపేట జిల్లాలో 2.40లక్షల ఎకరాల్లో మొత్తం సుమారు ఐదు లక్షల ఎకరాల్లో యాసంగిలో సన్నధాన్యం సాగయినట్టు అంచనా. యాదాద్రి జిల్లాలో సన్నాల సాగు జరగలేదని, ఎక్కడన్నా రైతులు అతి స్వల్పంగా ఎకరం, రెండెకరాల్లో సాగుచేసినా అది విక్రయానికి రాదని, సొంత అవసరాలకే వినియోగించుకుంటారని అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తంగా ఈ యాసంగిలో సుమారు 12లక్షల మెట్రిక్‌టన్నుల వరకు సన్నధాన్యం ఉత్పత్తి వస్తుందని అంచనా వేస్తున్న అధికార యంత్రాంగం వీలైనంత వరకు కొనుగోలు చేయాలని భావిస్తోంది. అయితే మిల్లర్లు ప్రభుత్వ కనీస మద్దతు ధర కంటే ఎక్కువ ధర ఇస్తే మిల్‌పాయింట్ల వద్దనే రైతులు సన్నధాన్యం విక్రయిస్తుండటంతో వానాకాలం సీజన్‌లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు సన్నధాన్యం ఆశించినరీతిలో రాలేదు. ఒక్క నల్లగొండ జిల్లాలో వానాకాలం సీజన్‌లో 80వేల క్వింటాళ్ల సన్నధాన్యం మిగతా 8వ పేజీలో...

జిల్లా	సాగు (ఎకరాల్లో)	ఉత్పత్తి అంచనా (మె.ట)	కొనుగోళ్ల లక్ష్యం	కొనుగోలు కేంద్రాలు
నల్లగొండ	5,14,031	12,14,449	11,26,021	375
సూర్యాపేట	4,73,000	12,05,396	11,00,000	308
యాదాద్రి	2,98,912	5,00,000	4,50,000	370
మొత్తం	12,85,943	29,19,845	26,76,021	1,053

కోతుల వల్లే విద్యుత్ ప్రమాదం



ప్రమాద ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఈ నరేష్‌బాబు

● రూ.5 లక్షల వరకు నష్టం : సాగర్ ప్రాజెక్టు సీఈ అజయ్‌కుమార్

నాగార్జునసాగర్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రధాన డ్యాం వద్ద బుధవారం జరిగిన అగ్ని ప్రమాదం కోతులు విద్యుత్ తీగలను కదిలించడం వల్ల స్పార్క్ వచ్చి షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఉండవచ్చని సాగర్ ప్రాజెక్టు సీఈ అజయ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన ఈఈ మల్లిఖార్జున్‌రావుతో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రమాదం జరిగిన స్థలంలో కిలోమీటరు మేర కార్పెట్ గడ్డితో పాటు సీసీ కెమెరాల కేబుళ్లు కాలిపోయినట్లు తెలిపారు. సీసీ కెమెరాలు ఎంత వరకు బాగున్నాయని సాంకేతిక నిపుణులు పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రమాదంతో సుమా రు రూ.3నుంచి రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లి ఉంటుందని అంచ నా వేశారు. అధికారులు పూర్తి స్థాయిలో పరిశీలించి ఒకటి రెండు రోజుల్లో పూర్తిగా నష్టం ఏ మేరకు వాటిల్లిందో అంచనా వేయనున్నట్లు తెలిపారు. మరల ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు కేబుళ్ల చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. వారి వెంట ఎస్పీఎఫ్ ఆర్ఐలు శ్రీనివాస్‌రావు, ప్రతాప్‌నాయుడు, ప్రాజెక్టు ఇంజనీర్లు సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ఉన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:32 (శుక్రవారం సాయంత్రం)

సహర్: 4:57 (శనివారం ఉదయం)

రోడ్డు ప్రమాదాల నివారణకు

అంతా కృషి చేయాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



నల్లగొండ రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి రోడ్డు భద్రతా సమావేశంలో ఆమె మాట్లాడారు. వాహనాలు నడిపే వారి నిర్లక్ష్యం, రోడ్డు భద్రతా నియమాలు పాటించకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. దీంతో విలువైన ప్రాణాలు పోతున్నాయన్నారు. రహదారులపై ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉన్న ప్రాంతాలను గుర్తించాలన్నారు. పోలీస్‌శాఖ సూచనల మేరకు ఆయా ప్రదేశాల్లో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉద్యోగ ధర్మంతో పాటు, సామాజిక బాధ్యతగా రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. గ్రామాల్లోని రహదారులను పంచాయతీ నిధుల ద్వారా మరమ్మతు చేయిస్తామన్నారు. పోలీస్‌శాఖ తీసుకున్న చర్యల ఫలితంగా జిల్లాలో బ్లాక్ స్పాట్లు 60 నుంచి 40కి తగ్గాయన్నారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులను ఆమె అభినందించారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ, జాతీయ రహదారుల సమీపంలోని గ్రామాల్లో రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాలకు అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు. మర్రిగూడ బైపాస్ ఫ్లై ఓవర్ వద్ద రోడ్డు పనుల కారణంగా ట్రాఫిక్‌జాం అవుతోందని, ఇక్కడ ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉన్నందున, పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కృషిచేసిన పోలీస్, ఆర్అండ్‌బీ, ఎన్‌హెచ్ఏ అధికారులకు ఈ సందర్భంగా ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రోడ్లు భవనాల శాఖ, జాతీయ రహదారుల సంస్థ అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు



జిల్లా కేంద్రంలోని ఓ కేంద్రంలో హాల్ టికెట్ నంబర్ల కేటాయింపును పరిశీలిస్తున్న డీఈవో భిక్షపతి

నల్లగొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈనెల 21 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేస్తారు. జిల్లాలో 105 రెగ్యులర్, మూడు ప్రైవేట్ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 18,825మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. అందులో 18,666మంది రెగ్యులర్ 159మంది ప్రైవేట్‌గా పరీక్షలు రాయనున్నారు. 9,669మంది బాలురు, 8,997మంది బాలికలు హాజరుకానున్నారు. నిమిషం నిబంధనను సడలిస్తూ అదనంగా 5నిమిషాల వరకు పరీక్షకు హాజరయ్యేందుకు అవకాశం కల్పిస్తున్నారు. ప్రతీ విద్యార్థి పరీక్ష కేంద్రాలకు గంట ముందుగానే చేరుకోవాలని విద్యాశాఖ అధికారులు సూచిస్తున్నారు. పరీక్ష నిర్వహణకు 105మంది సీఎస్‌లను, మరో 105మంది డీవోలను, 986మంది ఇన్విజిలేటర్లను నియమించారు. పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులతో పాటు సీఎస్‌లు, డీవోలు సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావద్దని విద్యాశాఖాధికారులు స్పష్టం చేశారు.

పటిష్ఠ బందోబస్తు : ఎస్పీ

పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేస్తున్నామని, 144 సెక్షన్ అమలులో ఉంటుదని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష కేంద్రాల సమీపంలో అన్ని జిరాక్స్ సెంటర్‌లు, ఇంటర్‌నెట్‌లు, లౌడ్ స్పీకర్లను బంద్ చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 500మీటర్ల వరకు ప్రజలు గుమి కూడవద్దన్నారు.

ముగిసిన ఇంటర్ సెకండియర్ పరీక్షలు

జిల్లా వ్యాప్తంగా ఇంటర్ సెకండియర్ పరీక్షలు గురువారం ముగిశాయి. ఇప్పటికే బుధవారం మొదటి సంవత్సరం పరీక్షలు ముగిశాయి. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు హాస్టళ్లను ఖాళీచేసి సొంత గ్రామాలకు బయలుదేరి వెళ్లారు. దీంతో బస్టాండ్ విద్యార్థులతో కిటకిటలాడింది.

సెమినార్‌తో జాతీయస్థాయి గుర్తింపు



సమావేశంలో మాట్లాడుతున్న ఎకనామిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నరేష్

మిర్యాలగూడ టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సెమినార్‌తో కేఎన్ఎం డిగ్రీ కళాశాలకు జాతీయస్థాయిలో గుర్తింపు లభించిందని ఎకనామిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్, సెమినార్ కన్వీనర్ డాక్టర్ నరేష్ గుమ్మడి అన్నారు. గురువారం స్థానికంగా విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇండియన్ కౌన్సిల్ ఫర్ సోషల్ సైన్స్ రీసెర్చ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సదస్సుకు 115 ప్రెజెంటేషన్స్ (రీసెర్చ్ ప్రాజెక్ట్స్) వచ్చాయన్నారు. అందులో వ్యవసాయం, నీటి పారుదల అంశాలపై అధిక ప్రాజెక్టులు రాగా, ద్వితీయ స్థానంలో ఐటీ రంగానికి సంబంధించిన అంశాలు ఉన్నాయన్నారు. దేశ నలుమూలల నుంచి వచ్చిన విద్యా నిపుణులు రాష్ట్రాభివృద్ధికి సంబంధించి పలు సూచనలు చేశారన్నారు. సెమినార్‌లోని అంశాలతో బుక్‌లెట్ రూపొందించి ఉన్నత విద్యామండలి, ఐసీఎస్ఎస్ఆర్‌కు సమర్పించనున్నట్టు తెలిపారు. అందరి సహకారంతో సెమినార్ విజయవంతం అయ్యిందన్నారు. సమావేశంలో కళాశాల అధ్యాపకులు త్రాసు వెంకటరమణ, రేఖారాణి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్య రంగాలను

విస్మరించిన రాష్ట్ర బడ్జెట్

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

నల్లగొండ రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రాధాన్య రంగాలను విస్మరించిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. గురువారం స్థానిక దొడ్డికొమరయ్య భవనంలో జరిగిన పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో అంకెలు కేటాయించాయి తప్ప, అవి ప్రజల అవసరాలకు అనుగుణంగా లేవన్నారు. అత్యంత ప్రాధాన్యరంగాలైనా విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమం, సాగునీరు, గ్రామీణ, పట్టణాభివృద్ధికి బడ్జెట్ కేటాయింపులు తక్కువగా ఉన్నాయన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, మహాలక్ష్మి పథకం, కొత్త అసరా పింఛన్లు, వ్యవసాయ కార్మికులకు ఆత్మీయ భరోసా పథకాలపై స్పష్టత లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై భారాలు మోపుతూ పెట్టుబడిదారులు, కార్పొరేటు శక్తులను లక్షల కోట్ల రూపాయల రుణాల నుంచి విముక్తులను చేస్తున్నాయని విమర్శించారు. ప్రజలకు బీజేపీ, కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసే వరకు ప్రజలతో కలిసి సమరశీల ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. తొలుత ఎస్ఎల్‌బీసీ సొరంగంలో మృతిచెందిన కార్మికులకు, ఇంజనీర్ల సంతాపం తెలిపారు. పార్టీ నేత తిరందాసు గోపి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, నాయకులు పాలడుగు నాగార్జున, ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, నారి అయిలయ్య, డబ్బికార్ మల్లేషం, బండ శ్రీశైలం, ప్రభావతి, సిహెచ్.లక్ష్మీనారాయణ, సయ్యద్ హాషం, వి.వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

59 కారుణ్య నియామక పోస్టుల భర్తీ

జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి •7లో..

ఛిద్రమైన పల్లెలు

● కిష్టరాయినిపల్లి రిజర్వాయర్‌తో సర్వం కోల్పోయిన లక్ష్మణాపురం ● పునరావాసం కల్పనలో వైఫల్యం ● ఇంటి స్థలం అంతే

చుట్టూ పచ్చని చెట్లు, పక్షుల చప్పుళ్లు, ఎత్తయిన గుట్టల మధ్యలో పాడిపంటలతో ఒక నాడు అలరారిన పల్లె, నేడు కళ తప్పిబోసి పోయింది. నాడు దర్జాగా వ్యవసాయం చేసిన రైతులు నేడు పట్నంలో చిన్నచిన్న అద్దె గదుల్లో ఉంటూ ఏదో ఒక పనిచేసుకుంటూ దుర్భరజీవితాన్ని గడుపుతున్నారు. ఇదీ నల్లగొండ జిల్లా డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న కిష్టరాయినిపల్లి రిజర్వాయర్‌లో ముంపునకు గురైన లక్ష్మణాపురం గ్రామస్థుల పరిస్థితి. ఏళ్లు గడుస్తున్నా పునరావాసం అందక అటు పల్లె, ఇటు ప్రజల జీవితాలు ఛిద్రమయ్యాయి.

(ఆంధ్రజ్యోతి-నాంపల్లి)



ప్రజలు వెళ్లిపోవడంతో వెలవెలబోతున్న లక్ష్మణాపురం

డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సాగు, తాగునీరు కోసం రూ.685 కోట్లతో 5.96టీఎంసీ నీటి సామర్థ్యంతో కిష్టరాయినిపల్లి రిజర్వాయర్‌ను నాంపల్లి మండలం స్వాములవారిలింగోటం గ్రామపంచాయతీ పరిధిలోని లక్ష్మణాపురం గ్రామంలో 95 రీచ్‌లతో చేపట్టింది. ఇందుకోసం ప్రభుత్వం నాంపల్లి మండలంలోని హైదలాపురం, టీపీ గౌరారం, లక్ష్మణాపురం, మర్రిగూడ మండలంలోని బాట్లపల్లి, ఈదులగండి, చింతపల్లి మండలంలోని కిష్టరాయినిపల్లి, వీకే మల్లేపల్లి గ్రామాల్లోని 2,054 ఎకరాల భూమిని రైతుల నుంచి సేకరించింది. 70 వేల నుంచి లక్ష ఎకరాలకు సాగు నీటి లక్ష్యంతో రిజర్వాయర్‌ను నిర్మిస్తున్నారు. మర్రిగూడ మండలంలోని ఈదులగండి, నాంపల్లి మండలంలోని లక్ష్మణాపురం గ్రామాల్లో వ్యవసాయ భూములతో పాటు నివాస ప్రాంతాలు పూర్తిగా మునిగిపోతుండగా, మిగతా గ్రామాల్లో కొందరి రైతుల భూములు మాత్రమే ప్రభుత్వం సేకరించింది.

నెరవేరని హామీ

వ్యవసాయ భూమికి నష్టపరిహారంగా మొదట ఎకరాకు రూ.4.15 లక్షలు, తరువాత ఎకరాకు రూ.5.15లక్షల నష్టపరిహారం అందించింది. లక్ష్మణాపురం గ్రామంలో 124 ఇళ్లు, 175 కుటుంబాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఒక్కో ఇంటికి నిర్మాణాన్ని బట్టి అధికారులు నష్టపరిహారం రూ.30 వేల నుంచి రూ.10 లక్షల వరకు అందించారు. ఆర్ఆర్ ప్యాకేజీ కింద 224 మందికి రూ.7.61లక్షల ఆర్థిక సహాయం అందజేసింది. ఇంటి ముందు ఉన్న ఖాళీ స్థలాలకు గజం రూ.55 చొప్పున నష్టపరిహారం అందించింది. హైదరాబాద్‌కు ఆనుకున్న ఉన్న రంగారెడ్డి జిల్లాలో ఇంటి స్థలాలతో పాటు ఇల్లు నిర్మించి ఇస్తామన్న హామీలు నేటికీ అమలుకు నోచుకోలేదు. గత రెండు శాసనసభా ఎన్నికలతో పాటు మునుగోడు ఉప ఎన్నికలోనూ ఈ హామీని ప్రజా ప్రతినిధులు ఇచ్చినప్పటికీ ఆచరణలో కార్యారూపం దాల్చలేదు. సర్వే నెంబర్ 327లో 40ఎకరాల భూమికి నష్టపరిహారం, 2017 నాటికి 18ఏళ్లు నిండిన వారికి మాత్రమే ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందజేశారు. కానీ ప్రస్తుతం 2025 నాటికి ఉన్న 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ ప్యాకేజీ అందజేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. సర్వే సమయంలో అధికారులు కొన్ని ఇళ్లను సర్వే చేయలేదని వాటిని కూడా సర్వే చేసి వారికి నష్టపరిహారం అందించాలని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దాదాపు తొమ్మిదేళ్లు గడుస్తున్నా ఇళ్ల స్థలాలు కేటాయించకపోవడంతో నిర్వాసితులు నిరాశలో ఉన్నారు.

● కళతప్పిన పల్లె

లక్ష్మణాపురం చిన్న పల్లె కావడం, గ్రామస్థులు వ్యవసాయం మీద పూర్తిగా ఆధారపడి ఉండటం, చుట్టూ గుట్టల మధ్యలో ఉండడం ఈ రిజర్వాయర్ నిర్మించడానికి అనువైన ప్రదేశం అని అధికారులు గుర్తించేవరకూ లక్ష్మణాపురం పెద్దగా ప్రాచుర్యంలో లేదు. అక్కడకి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం కూడా ఉండేది కాదు. ఇక్కడి ప్రజలు వ్యవసాయం చేస్తూ గ్రామంలో చాలా సంతోషంగా ఉండేవారు. ప్రతీ ఇంటి వారికి పొలం ఉండేది.వ్యవసాయ పనులతో సందడిగా గ్రామం కనిపించేది. అయితే రిజర్వాయర్ కోసం భూసేకరణ అనంతరం చాలామంది గ్రామం విడిచి హైదరాబాద్‌కు వెళ్లడంతో గ్రామం కళ తప్పింది. జీవనోపాధి కోసం పనులు చేసుకోగలిగిన వారు ఊరు వదిలివెళ్లిపోగా, వృద్ధులతో పాటు మరికొందరు వ్యవసాయం చేస్తూ ఇక్కడే ఉంటున్నారు. ఓనాడు భూసామిగా ఉన్న వారు ఇప్పుడు ఏదో ఒక ఉపాధి చూసుకుంటూ జీవితాన్ని కొనసాగిస్తున్నారు.



ఇల్లు ఇంకా రాలేదు

మాకు నచ్చిన దగ్గర ఇల్లు కట్టిస్తామని రిజర్వాయర్ పనులు మొదలుపెట్టిన నాటి నుంచి చెబుతూనే ఉన్నారు. ఏళ్లు గడిచినా ఇళ్లస్థలాల జాడలేదు. ఇంటి ముందు ఉన్న ఖాళీ జాగకు గజానికి రూ.55 ఇచ్చారు. ఎక్కడన్నా ఇప్పుడు రూ.55 జాగ దొరుకుతుందా. ప్రభుత్వం మా బాధలను తెలుసుకోవాలి. పుట్లకొద్దీ వడ్లు పండించిన, తీరొక్క పంటలు పండిన బంగారం లాంటి భూములను పోగొట్టుకున్న మమ్మలను ప్రభుత్వం ఆదుకోవాలి. మా బతుకులు ఎట్లో అట్లా వెళ్లిపోయింది. మా పిల్లలకైనా దారి చూపాలి.

గడ్డి ముత్తయ్య, లక్ష్మణాపురం, భూనిర్వాసితుడు

ఐదుగురం అన్నదమ్ములం
ఏడ ఉంటామో, ఎక్కడ పోతామో

మేము ఐదుగురం అన్నదమ్ములం. ఊరిలో ఉంటే ఎక్కడ ఉన్నా పొలం దగ్గరో, ఇంటి దగ్గరలో పలకరించుకునేవాళ్లం. సిరులు పండే పంట భూములు పాయె, ఇల్లు పొబట్టే ఇక్కడి నుంచి వెళ్లిపోతే ఎక్కడ ఉంటామో తెల్వదు. దిగులు పట్టుకుంది. పిల్లలు పెద్దవాళ్లయ్యే. వాళ్ల బతుకుదెరువు కోసం వాళ్లు ఎక్కడికి పోతే అక్కడికివారి వెంట పోవాల్సి వస్తోంది. భూములు పోయే, తోడబుట్టిన అన్నదమ్ములం, పుట్టిన ఊరు విడిచిపోయే బాధ వచ్చే. ఇంతకన్నా పెద్ద కష్టం ఏముంటుంది మనిషికి.

గడ్డి మల్లయ్య, లక్ష్మణాపురం, భూనిర్వాసితుడు





నిర్మానుష్యం నర్సింహులగూడెం

(ఆంధ్రజ్యోతి-మర్రిగూడ)

ఏళ్లుగా ఏర్పడిన బంధాలు, అనుబంధాలు, ఆత్మీయతలు విడదీయకుండా ఉన్న నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని నర్సిరెడ్డిగూడెం గ్రామం నేడు నిర్మానుష్యమై కళ తప్పింది. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా చర్లగూడ రిజర్వాయర్ నిర్మాణం కోసం నర్సిరెడ్డిగూడెం, చర్లగూడెం, వెంకేపల్లి, వెంకేపల్లి తండా పూర్తిగా ముంపుకు గురయ్యాయి. రిజర్వాయర్ కట్ట నిర్మాణం ఉన్న దశలో అతి సమీపంలోని నర్సిరెడ్డిగూడెం ముంపునకు గురైంది. కష్టసుఖాలు పంచుకొన్న పల్లె మనుషులు దూరం కావడంతో మోడువారింది. నర్సిరెడ్డిగూడెం పూర్తిగా ముంపును గురవుతుండటంతో 298మందిని లబ్ధిదారులుగా గుర్తించారు. వీరికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇచ్చినప్పటికీ పునరావాసం కల్పించడం ఆలస్యమైంది. అయితే ఈ మధ్యకాలంలో 298మందిలో 257మందికి పునరావాసానికి సంబంధించిన పట్టా ధ్రువపత్రాలు అందజేశారు. ఇంకా 37మందికి పట్టా స్థలాలను అందజేయలేదు. పట్టా స్థలాలు ఇవ్వకుండా, పునరావసం కల్పించకుండా అధికారులు బలవంతంగా ముంపు బాధితులను ఖాళీ చేయించారు. దీంతో ఏంచేయలేని స్థితిలో ఉన్న బాధితులు ఎవరికి వారే ఇండ్లు ఖాళీ చేసి వేరే గ్రామంలో అద్దెకి ఉంటున్నారు. అయితే నర్సిరెడ్డిగూడెం ఖాళీ కావడంతో ప్రజలు లేక గ్రామం నిర్మానుష్యంగా మారింది.

ప్యాకేజీ అందించాలి

18ఏళ్లు నిండిన వారికి మాత్రమే ప్రభుత్వం ప్యాకేజీ అందించింది. మాకు ఇప్పటివరకూ పూర్తిస్థాయిలో పరిహారం అందజేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. ప్రభుత్వమే పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందిస్తే ఇక్కడ ఉండేవాళ్లం కాదుగా. ఇక్కడ ఉండకుంటే 18 ఏళ్లు నిండిన వారికి ప్యాకేజీ ఇవ్వాలని అడిగేవాళ్లం కాదుగా. ప్రస్తుతం ఊరిలో ఇప్పుడూ 18 ఏళ్లు నిండిన వారు 18 మంది యువకులు ఉన్నారు. వాళ్లకు కూడా ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందిస్తే వాళ్లకు కూడా ఆర్థిక సహాయం చేసిన వాళ్లవుతారు. వారు కూడా పుట్టిన ఊరిని విడిచి చిన్నచిన్న వ్యాపారం అయినా చేసుకుంటారు.

నక్కనగోని ఈశ్వర్, లక్ష్మణాపురం, భూనిర్వాసితుడు

మేం ఆగమయ్యాం

రిజర్వాయర్ కింద నాకున్న 13 ఎకరాల భూమి పోయింది. 12 ఎకరాల భూమికి మాత్రమే పైసలు వచ్చాయి. ఎకరాకు రూ.4.15క్షలు మాత్రమే ఇచ్చారు. కుటుంబంతో ఇక్కడే వ్యవసాయం చేసుకుంటూ ఉండేవాళ్లం. ఈ భూమిని నమ్ముకొని కుమారుడు, ఇద్దరు బిడ్డల పెళ్లిళ్లు చేసిన. కొడుకు పట్నంలో ఉంటున్నాడు. నన్ను రమ్మంటే చావు దగ్గరకు అయ్యాక ఊరును విడిచి పోబుద్ధి కాక ఇక్కడే ఉన్న. పైసలు రాని ఎకరం భూమిలో వ్యవసాయం, చేసుకుంటూ ఇక్కడే ఉంటున్నా. 12 ఎకరాల భూమికి ప్రభుత్వం పైసలు ఇస్తే బయట రెండు ఎకరాలు కూడా వస్తాలేదయే. ఒక్కప్పుడు ఆసామిగా బతికి ఇప్పుడూ గుంట భూమి లేని వాడినయ్యా. ఈ ప్రాజెక్ట్‌తో ఎవరు బాగుపడుతారో ఏమో గానీ మేం ఆగమయ్యాం, మాలాంటి బాధలు ఎవరికీ రావొద్దు.

ఆమనగంటి సత్తిరెడ్డి, భూనిర్వాసితుడు, లక్ష్మణాపురం

'రియల్' ఏజెంట్ ఆత్మహత్య




సుబ్బారావు(ఫైల్)

హుజూర్‌నగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : రియల్ ఎస్టేట్ వ్యాపారంలో నష్టం రావడంతో రియల్ ఎస్టేట్ ఏజెంట్ ఆత్మహత్య చేసుకున్నాడు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని పీర్లకొట్టం బజారులో నివాసముంటున్న నిమిషకవి సుబ్బారావు(45) రియల్ ఎస్టేట్ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. భార్య ఉమామహేశ్వరి పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. ఇటీవల రియల్ ఎస్టేట్ వ్యాపారంలో సుబ్బారావుకు నష్టం వాటిల్లింది. బుధవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసిన సుబ్బారావు అర్ధరాత్రి దాటాక ఇంట్లో కనిపించకపోవడంతో వెతికింది. డాబాపైకి వెళ్లి చూసే సరికి ఉరివేసుకుని కనిపించాడు. ఈ ఘటనపై భార్య ఉమామహేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు. సుబ్బారావుకు భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కుటుంబ కలహాలతో వివాహిత ...

చౌటుప్పల్ రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తంగెడపల్లి గ్రామానికి చెందిన వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ చెందిన బుంగభట్ల స్వప్న(28)కు తంగెడపల్లి గ్రామానికి చెందిన మహేశ్‌తో ఆరేళ్ల కిందట వివాహమైంది. ఇటీవల భార్యాభర్తల మధ్య గొడవ తలెత్తింది. దీంతో మనస్తాపానికి గురైన స్వప్న గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుంది. సాయంత్రం ఇంటికి వెళ్లిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. స్వప్న తల్లి రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. స్వప్నకు భర్తతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



కృష్ణ(ఫైల్)

పెద్దవూర, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలో గురువారం విద్యుదాఘాతానికి గురై రైతు మృతి చెందాడు. ఎస్ఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం నాయనవానికుంటతండా గ్రామానికి చెందిన రమావత్ కృష్ణ(36) అనే రైతు గ్రామశివారులోని తన వ్యవసాయ భూమిలోని చేపల చెరువులో మోటార్ పెట్టడానికి గురువారం తెల్లవారుజామున 5.30గంటలకు వెళ్లాడు. అక్కడ మోటార్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్ తగిలి విద్యుదాఘాతానికి గురై పడిపోయాడు. గమనించిన స్థానికులు కృష్ణను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్ ద్వారా నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆసుపత్రికి తరలించగా అక్కడ పరీక్షించిన వైద్యులు కృష్ణ అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. కృష్ణకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. భార్య రమావత్ జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కార్యదర్శికి తీవ్రగాయాలు

నార్కట్‌పల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని నక్కలపల్లి గ్రామకార్యదర్శి సుంకరబోయిన రవిశంకర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదం నార్కట్‌పల్లి-అద్దంకి జాతీయ రహదారిపై మహాత్మాగాంధీ యూనివర్సిటీ సమీపంలో గురువారం ఉదయం జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నక్కలపల్లిలో గ్రామకార్యదర్శిగా పనిచేస్తున్న రవిశంకర్ విధులకు హాజరయ్యేందుకు తన బైక్‌పై స్వగ్రామం చర్లపల్లి నుంచి బయలుదేరాడు. యూనివర్సిటీ సమీపంలోకి రాగానే వెనక నుంచి అతివేగంగా అజాగ్రత్తగా వచ్చిన కారు రవిశంకర్ బైక్‌ను ఢీకొట్టి వెళ్లింది. ప్రమాదంలో రవిశంకర్ తలకు బలమైనగాయాలు కావడంతో వెంటనే నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సనిమిత్తం అందించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దగ్గుల క్రాంతికుమార్ తెలిపారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు



గాయపడ్డ సోమయ్య

అడ్డగూడూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలో బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చిర్రగూడూరు గ్రామానికి చెందిన బెల్లం సోమయ్య తన వ్యవసాయ బావి వద్ద పనులు పూర్తి చేసుకొని సాయంత్రం ఇంటికి వస్తున్నాడు. తొర్రూరు-వలిగొండ ప్రధనా రహదారిపై తన సైకిల్‌పై వస్తున్న క్రమంలో కోటమర్తి గ్రామానికి చెందిన సతీష్ తన బైక్‌పై తిరుమలగిరి నుంచి కోటమర్తికి వెళ్తూ ముందున్న సోమయ్య సైకిల్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో సోమయ్యకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స కోసం సూర్యాపేటకు తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ నాగరాజు తెలిపారు.

దొంగతనం కేసులో నిందితుడు అరెస్టు, రిమాండ్

నల్లగొండ క్రైం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : చోరీ కేసులో ఓ వ్యక్తిని నల్లగొండ జిల్లా నల్లగొండ రూరల్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడి వద్ద నుంచి ఐదు తులాల బంగారు ఆభరణాలు, రూ.20వేల నగదు, చోరీ చేసిన స్కూటీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నల్లగొండ టూటౌన్ సర్కిల్ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను సీఐ రాఘవరావు, రూరల్ ఎస్ఐ సైదాబాబు వెల్లడించారు. దామరచర్ల మండలం వాడపల్లి గ్రామంలోని గాంధీనగర్‌కు చెందిన బత్తుల విజయచందర్ సులువుగా డబ్బులు సంపాదించి తాగుడుతో పాటు జల్సాలకు అలవాటుపడ్డాడు. ఈ క్రమంలో ఈ నెల 16వ తేదీన నల్లగొండ మండలం చర్లపల్లి గ్రామంలోని మనోరమ టౌన్‌షిప్‌లో అనంతుల ప్రవీణ్, గుండ్లపల్లి సంతోష్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో చోరీకి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు నల్లగొండ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ తెలిపారు. ప్రవీణ్ ఇంట్లో బంగారు గొలుసు, బంగారు చేతి ఉంగరాలు(మూడు తులాలు), పక్కనే ఉన్న గుండ్లపల్లి సంతోష్ ఇంట్లో గాజులు, మాటీలు, చెవి కమ్మలు, ఉంగరం, ముక్కలు మొత్తం కలిపి రెండు తులాలు, రూ. 20వేల నగదును చోరీ చేశాడు. అదేవిధంగా ఇంట్లో లభించిన తాళంతో వరండాలోని స్కూటీని తీసుకుని నేరుగా వాడపల్లిలోని తన ఇంటికి వెళ్లాడు. అనంతరం చోరీ చేసిన స్కూటీపై దొంగలించిన బంగారు ఆభరణాలను హైదరాబాద్‌లో విక్రయించేందుకు గురువారం వెళ్తున్నాడు. చర్లపల్లి వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించడంతో చేసిన నేరాన్ని అంగీకరించాడని సీఐ తెలిపారు. నిందితుడిపై గతంలో 2016లో వాడపల్లి పీఎస్‌లో చోరీ కేసులో అరెస్టయి జైలుకు కూడా వెళ్లి వచ్చాడని, జైలు నుంచి వచ్చిన తర్వాత స్కూల్‌లో ట్యూటర్‌గా పనిచేస్తూ జల్సాలకు, తాగుడుకు అలవాటై చోరీలు చేస్తున్నాడన్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. కేసును ఛేదించిన నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి, సీఐ రాఘవరావు, ఎస్ఐ సైదాబాబు, సిబ్బంది తిరుమలేష్, జానకి రాములు, టూటౌన్ సిబ్బంది బాలకోటి, శంకర్‌లను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ టూటౌన్ సీఐ రాఘవరావు

విద్యుత్ మోటారు దొంగల అరెస్ట్

గుర్రంపోడు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : జల్సాలకు అలవాటు పడి విద్యుత్ మోటార్లను దొంగిలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు నల్లగొండ జిల్లా గుర్రంపోడు ఎస్ఐ పసుపులేటి మధు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 10వ తేదీన చామలేడు గ్రామానికి చెందిన గుండెబోయిన యాదయ్యకు చెందిన ఐదు హెచ్‌పీ మోటారు ఎస్ఎల్‌బీసీ కాల్వ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారని బాధితుడు ఫిర్యాదుచేశాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. గురువారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో ఆరెగూడెం బస్‌స్టేజి వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా చామలేడు గ్రామానికి చెంది దోటి సైదులు, దోటి శంకర్, దోటి అశోక్ మోటారు సైకిల్‌పై కరెంటు తీగలను తీసుకొని వెళ్తున్నారు. అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని పట్టుకొని విచారణ చేశారు. గతేడాది నుంచి చామలేడు, గుర్రంపోడు గ్రామ శివారులోని ఎస్ఎల్‌బీసీ కాల్వల్లోని రైతుల నాలుగు కరెంటు మోటార్లను, 80 మీటర్ల విద్యుత్ తీగలను చోరీ చేసినట్లు అంగీకరించారు. జల్సాలకు అలవాటుపడి డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో మోటార్లను, విద్యుత్ తీగలను దొంగతనం చేసి దోటి సైదులు వ్యవసాయ భూమి వద్ద ఉంచిన సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మోటారు సైకిల్‌తో పాటు రూ.94,900 విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. దొంగతనాలను ఛేదించిన ఎస్ఐ మధు, సిబ్బంది కావలి నర్సింహా, నాగరాజు, సత్యనారాయణ, వెంకటేష్, సైదులును దేవరకొండ ఏఎస్పీ మౌనిక అభినందించారు.



స్వాధీనం చేసుకున్న విద్యుత్ మోటార్లతో పోలీసులు

యువతి అదృశ్యం

నిడమనూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం తుమ్మడం గ్రామంలో ఓ యువతి అదృశ్యమైంది. ఎస్ఐ గోపాల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం తుమ్మడం గ్రామానికి చెందిన కొప్పుల శ్రీనివాస్, లక్ష్మమ్మ దంపతుల కుమార్తె మంజు(20) హైదరాబాద్‌లోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. నెల రోజుల క్రితం తుమ్మడం వచ్చి ఇంటి వద్దే ఉంటోంది. ఈ క్రమంలో బుధవారం మంజు తల్లి లక్ష్మమ్మ నిద్రపోయి ఉండగా మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది.లక్ష్మమ్మ లేచిచూడగా కుమార్తె ఇంట్లో కనబడలేదు.చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో విచారించినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో మంజు తండ్రి శ్రీనివాస్ నిడమనూరు పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదుచేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. కాగా మంజు ఐదు అడుగుల ఎత్తు ఉండి, ఎరుపు రంగులో ఉంటుందని ఎస్ఐ తెలిపారు.

10 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

వలిగొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా నిల్వ చేసిన 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గురువారం యాదాద్రిభువనగిరి వలిగొండ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం తుర్కపల్లి మండలం బిల్యాతండా పరిధి మల్కాపురం గ్రామానికి చెందిన గుగులోతు రాములు వలిగొండ మండలం కంచనపల్లి గ్రామపరిధిలో 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేశాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించి రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రాములుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



భువనగిరి సమీపంలో హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై కనిపిస్తున్న ఎండమావులు



సూర్యప్రతాపం.. ఎండమావి దర్శనం

రోజు రోజుకూ ఎండవేడిమి పెరుగుతోంది. రానురాను ఎండలు మరింత ముదిరే అవకాశం ఉంది. పది గంటల నుంచే వడగాడ్పులు వీస్తుండటంతో రహదారిపైకి వచ్చేందుకు వెనుకంజ వేస్తున్నారు. మధ్యాహ్నం రహదారులపై ఎండమావులు కనిపిస్తున్నాయి. వాహనాల కదలికల మధ్య ఎండమావులు అందరినీ ఆకట్టుకుంటున్నాయి.

ఫొటోలు : (ఆంధ్రజ్యోతి-స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, యాదాద్రి)

ఆరోగ్య నిపుణులతో
నైపుణ్యాలు పెంపొందిస్తాం

● ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా

బీబీనగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య సంరక్షణ నిపుణుల్లో అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడంపై దృష్టి సారించినట్లు ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా తెలిపారు. గురువారం యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్‌లోని అఖిలభారత వైద్య విజ్ఞాన సంస్థ(ఎయిమ్స్)లో నిర్వహించిన కమ్యూనికేషన్, డిజాస్టర్‌పై నిర్వహించిన వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ భాటియా మాట్లాడుతూ ఎయిమ్స్‌లోని నర్సింగ్ ఆఫీసర్లు, వైద్య అధ్యాపకులు, ఎంఎస్‌సీ నర్సింగ్ విద్యార్థుల్లో కమ్యూనికేషన్ వ్యూహాలపై అవగాహన కల్పించడంతో రోగుల సంరక్షణకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అంతే కాకుండా ఉద్యోగులలో నిబద్ధత, ప్రేరణ మెరుగుపరచడంలో కమ్యూనికేషన్ పాత్ర కీలకమన్నారు. ప్రాక్టికల్ వ్యాయామాలు, కేసులపై చర్చతో ప్రొఫెషనల్ కమ్యూనికేషన్ మెరుగు పరుచుకోవచ్చన్నారు. వర్క్‌షాప్‌లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఆరోగ్య సంరక్షణ నిపుణులు పాల్గొని శిక్షణా తరగతులను నిర్వహించారు. ఎయిమ్స్ డిప్యూటీ డైరెక్టర్ బిపిన్ వర్గీస్, సికింద్రాబాద్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ రేణుకాదేవి, ఎయిమ్స్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ లత, స్కూల్‌ఆఫ్ డిజిటల్ హెల్త్ సైన్సెస్ అండ్ టెక్నాలజీస్ మల్లారెడ్డి విశ్వవిద్యాపీఠం డీన్ సురేశ్ ముదుస్వామి పాల్గొన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు



ప్రాకార మండపంలో నిత్యకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య కైంకర్యాలు పాంచారాత్రగమశాస్త్ర రీతిలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు గజవాహన సేవలో తీర్చిదిద్దారు. వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్ఠింపజేసి, విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు కొనసాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి శేషవస్త్రాలు, ఆశీర్వచనం అందజేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహించారు. ప్రభాత వేళ గర్భాలయంలో స్వామిఅమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చకస్వాములు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయ రీతిలో జరిగాయి. కొండపైన శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 23,46,131 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

ఎస్‌ఎస్‌సీ రెమ్యునరేషన్ చెల్లించాలి

● టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి



డీఈవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

నల్లగొండ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): గత ఏడాది ఎస్‌ఎస్‌సీ మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్ వెంటనే చెల్లించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం. రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం డీఈవో కార్యాలయం ఎదుట నిర్వహించిన ఆందోళన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. పదవ తరగతి పరీక్షలు పూర్తయ్యే లోపు 2024 సంవత్సరంలో మూల్యాంకనం చేసిన రెమ్యునరేషన్ ఉపాధ్యాయుల ఖాతాల్లోకి జమ చేయాలని లేనిచో టెన్త్ పరీక్షల మూల్యాంకనాన్ని బహిష్కరిస్తామని ఆయన హెచ్చరించారు. టెన్త్ పరీక్షల ఇన్విజిలేషన్‌ను కేవలం ఎస్‌జీటీ ఉపాధ్యాయులను ఉపయోగించడం వల్ల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పెరమాళ్ల వెంకటేశం, ఉపాధ్యక్షుడు నర్ర శేఖర్‌రెడ్డి, సంఘం జిల్లా, మండల నాయకులు యాట మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గేర నర్సింహ, నలపరాజు వెంకన్న, మురలయ్య, సైదులు, నర్సింహమూర్తి, శ్యామ్ పాల్గొన్నారు.

ఏప్రిల్ 8 నుంచి సప్తజ్యోతిర్లింగాల సందర్శన యాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న నరేష్‌బాబు


రామన్నపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో ఐఆర్‌సీటీసీ సప్త జ్యోతిర్లింగ సందర్శన యాత్ర ఈ నెల ఏప్రిల్ 8వ తేదీన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి ప్రారంభమవుతుందని ఐఆర్‌సీటీసీ మార్కెటింగ్ ఇన్‌చార్జి నరేష్‌బాబు ఓర్సు తెలిపారు. గురువారం ఆయన రామన్నపేటలో విలేకరులతో మాట్లాడారు. సికింద్రాబాద్ ఐఆర్‌సీటీసీ ప్రత్యేక టూరిస్ట్ ప్యాకేజీతో భారత ప్రత్యేక టూరిస్ట్ రైలు ప్రారంభించినట్లు తెలిపారు. ఏప్రిల్ 8 ఐఆర్‌సీటీసీ సప్త జ్యోతిర్లింగ దర్శనయాత్ర సికింద్రాబాద్ మీదుగా ఉజ్జయినికి వెళ్తుందని వెల్లడించారు. ఏడు జ్యోతిర్లింగాల దర్శనాలు ఉంటాయని ఉజ్జయిని మహాకాళేశ్వర, ద్వారకా నాగేశ్వర్, సోమనాథ్, భీమ శంకర్, త్రయంబకేశ్వర, గృశ్నేశ్వర్, జ్యోతిర్లింగాలను సందర్శన అనంతరం తిరిగి ఏప్రిల్ 18న తిరుగు ప్రయాణమవుతుందన్నారు. ఈ యాత్రలో అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందించడంతో పాటు హోటల్ గదుల్లో బస ఏర్పాట్లు ఉంటాయని, ట్రావెల్ ఇన్సూరెన్స్ కూడా ఉంటుందన్నారు.

అటవీ సంరక్షణలో వన్యప్రాణులు



నల్లమల అటవీ ప్రాంతం





నల్లమల పరిధిలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్డ్ ఫారెస్ట్ కింద చందంపేట మండలం కంబాలపల్లి రేంజ్‌లో అటవీప్రాంతం ఉంది. ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ, కర్నూలు జిల్లాల్లోని 26,795 హెక్టార్లలో నల్లమల అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. సాగర్ రేంజ్ పరిధిలో కంబాలపల్లి, దేవరకొండ రేంజ్‌లు ఉన్నాయి. అటవీ శాఖ అటవీ సంపద, వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు చేపడుతుంది. అటవీ జంతువుల సంరక్షణకు గత సంవత్సరం కేంద్ర ప్రభుత్వం రూ.450 కోట్లు కేటాయించగా అభివృద్ధి పనులు చేపట్టారు.

\- (ఆంధ్రజ్యోతి దేవరకొండ)

అటవీ అభివృద్ధి, చెక్‌డ్యాంల నిర్మాణం, 50కిపైగా సీసీ కెమెరాలు, వాచ్‌టవర్లు, బేస్ క్యాంప్‌లు అటవీ చుట్టు ఇనుప కంచె ఏర్పాటు చేశారు. వన్యప్రాణులు, జంతువుల దాహార్తి తీర్చేందుకు 200కు పైగా నీటి తొట్లు, 20వరకు చెక్‌డ్యాంలు నిర్మించారు. నీటితొట్లు, చెక్‌డ్యాంలకు బోర్లు, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. నల్లమలలో అటవీ జంతువులు, వన్య ప్రాణుల సంఖ్య గణనీయంగా పెరిగింది. గత సంవత్సరం ఓ పెద్దపులి కర్నూలు నుంచి నల్లమలకు వచ్చింది. ప్రస్తుతం మళ్లీ పెద్దపులి కర్నూలు జిల్లావైపు మహబూబ్‌నగర్ జిల్లా అడవిలోకి వెళ్లిందని అధికారులు తెలిపారు. నల్లమలలో 45కుపైగా చిరుత పులులు, వందకుపైగా ఎలుగుబంట్లు, రేస్ కుక్కలు, మనుబోతులు, దుప్పులు, జింకలు, నెమళ్లు, కుందేళ్లు, వేల సంఖ్యలో అడవి పందులు ఉన్నట్లు అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ, కర్నూల్ జిల్లాల్లోని 26,795 హెక్టార్లలో విస్తరించిన నల్లమల కంబాలపల్లి రేంజ్‌లో జంతువుల సంరక్షణకు నీటితొట్లు, చెక్‌డ్యాంలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం చేపడుతున్న చర్యలతో నల్లమలలో అటవీ జంతువులు, వన్య ప్రాణుల సంఖ్య గణనీయంగా పెరిగిందని అటవీ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

వన్యప్రాణుల సంరక్షణకు నీటి తొట్లు ఏర్పాటు చేశాం



నల్లమల్ల కంబాలపల్లిరేంజ్‌లో అటవీ సంరక్షణకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది. అటవీ అభివృద్ధి, జంతువుల సంరక్షణకు చర్యలు తీసుకుంటుండడంతో నల్లమలలో జంతువులు, వన్యప్రాణుల సంఖ్య గణనీయంగా పెరిగింది. అటవీ చుట్టూ ఇనుప కంచె ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేపడుతున్నాం. నీటి తొట్లు ఏర్పాటు చేశాం.

● భాస్కర్, కంబాలపల్లి రేంజ్ అటవీశాఖ అధికారి

చట్టసభల్లో ప్రజల గొంతును వినిపిస్తుంది

● సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ సత్యం

నల్లగొండరూరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో ప్రజల గొంతు వినిపిస్తుందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకటరెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలోని మగ్దూం భవనంలో గురువారం ఎమ్మెల్సీగా ఎన్నికైన సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యాన్ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రజా సమస్యలను చట్ట సభల్లో వినిపించడమే కమ్యూనిస్టు ఎజెండా అని, అందుకే రెండు సభల్లో ప్రజల గొంతును వినిపించేందుకు అవకాశం వచ్చిందని అన్నారు. శాసనసభ ఎన్నికల ఒప్పందం ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం సీపీఐకి ఒక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పదవి ఇచ్చినట్లు తెలిపారు. పదేళ్లుగా శాసనసభ, శాసన మండలిలో పేదల పక్షాన మాట్లాడే గొంతుకైన కమ్యూనిస్టులు లేక ప్రజా సమస్యలు పరిష్కరించలేక పోయామన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం శాసన మండలిలో ప్రజా గొంతుకగా ప్రశ్నిస్తానని అన్నారు. కమ్యూనిస్టులకు పదవులు ముఖ్యం కాదని, వచ్చిన పదవితో బాధ్యతగా పని చేస్తారని అన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి, సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్‌రావు, మల్లేపల్లి ఆదిరెడ్డి, శ్రవణ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, బంటు వెంకటేశ్వర్లు, బలుగూరి నరసింహ, తిరుపారి వెంకటేశ్వర్లు, గురుజ రామచంద్రం, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కురిమిద్దె శ్రీనివాస్, పల్లె నరసింహ, ధనంజయనాయుడు, గుర్రం వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్సీ సత్యంను సన్మానించిన వారిలో వివిధ మండలాల కార్యదర్శులు ఎండీ అక్బర్, జిల్లా యాదగిరి, లింగానాయక్ సత్యనారాయణ, శాంతి సంఘం జిల్లా కార్యదర్శి జిల్లా యాదయ్య, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకులు ఎల్వీ యాదవ్, నాయకులు చీర పంకజ్‌యాదవ్, గుర్రం వెంకటరెడ్డి, మిర్యాల యాదగిరి, సైదులు, గుండబోయిన లింగయ్య యాదవ్, ప్రజాసంఘాల బాధ్యులు తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

59 కారుణ్య నియామకాల పోస్టుల భర్తీ

ప్రేమ్‌కరణ్‌రెడ్డి, జడ్పీ సీఈవో, నల్లగొండ



నల్లగొండ జిల్లా పరిషత్ పరిధిలో గురువారం 59 కారుణ్య నియామక పోస్టులను భర్తీ చేశారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్‌లో అనేక పోస్టులు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్నాయి. చాలా మంది అటెండర్ పోస్టులలో జాయిన్ కావడానికి నిరాకరిస్తూ వస్తున్నారు. దీంతో ప్రభుత్వం జూనియర్ అసిస్టెంట్ పోస్టుల్లో వారిని భర్తీ చేసేందుకు నిర్ణయించి ఉత్తర్వులు జారీ చేయడంతో నియామకాలు జరిగాయి. ఈ నేపథ్యంలో జిల్లా పరిషత్ సీఈవో ఎన్.ప్రేమకరణ్‌రెడ్డి ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

ఫటాఫట్

\- (నల్లగొండ,ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను భర్తీ చేశారా?

సీఈవో: ప్రభుత్వ ఆదేశాలతో కారుణ్య నియామకాలను భర్తీ చేశారు. 59మందికి జూనియర్ అసిస్టెంట్లుగా నియమిస్తూ ఆర్డర్లు ఇచ్చాం. వారందరూ బాధ్యతలను తీసుకోనున్నారు.

ఆంధ్రజ్యోతి: ఈ ఖాళీలు ఎప్పటి నుంచి ఉన్నాయి?

సీఈవో: 2022-23 సంవత్సరం వరకు ఖాళీగా ఉన్న పోస్టులను గుర్తించి ప్రభుత్వానికి నివేదించడం జరిగింది. ఈ కారుణ్య నియామకాల భర్తీకి ప్రభుత్వం నుంచి ఇటీవలే అనుమతి రావడంతో జడ్పీ పరిధిలో నియామకాలను పూర్తి చేశాం.

ఆంధ్రజ్యోతి: నియామక ఉత్తర్వులను ఎవరు అందజేశారు?

సీఈవో: హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపికైన వారికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియామక ఉత్తర్వులను అందజేశారు. 59మందికి గాను గురువారం 54 మంది హైదరాబాద్‌కు వచ్చారు. మిగతా ఐదుగురికి ఆర్డర్ కాపీలను ఇవ్వడం జరుగుతుంది.

ఆంధ్రజ్యోతి: కొత్తగా ఏమైనా కారుణ్య నియామకాలు ఖాళీలు ఉన్నాయా?

సీఈవో: మరో 10వరకు కారుణ్య నియామకాలు ఖాళీగా ఉన్నాయి. ఆ పోస్టులకు సంబంధించి భర్తీ చేయడం కోసం త్వరలోనే ప్రభుత్వానికి మరోసారి నివేదించనున్నాం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కారుణ్య నియామకాలు త్వరితగతిన భర్తీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. పోస్టులు భర్తీ చేయడం వల్ల గతంలో పనిచేసిన తల్లి లేదా తండ్రికి సంబంధించిన వారి కుటుంబ సభ్యులు త్వరితగతిన ప్రభుత్వ ఉద్యోగం పొందేందుకు అవకాశం కలిగింది.

రక్షణశాఖలో ఆడిటర్‌గా సుభాష్ చంద్రబోస్

సంస్థాన్‌నారాయణపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రక్షణశాఖలో ఆడిటర్‌గా ఏలే సుభాష్‌చంద్రబోస్ ఉద్యోగం సాధించాడు. యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండల కేంద్రానికి చెందిన చేనేత కార్మికుడు ఏలే నర్సింహ - పారిజాతల కుమారుడు సుభాష్ చంద్రబోస్. చదువుల్లో ప్రతిభ కనబరుస్తూ చంద్రబోస్ ఇప్పటికే నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. ఇటీవల జరిగిన ఎస్‌ఎస్ సీ సీసీఎల్ మంచి ర్యాంకు సాధించి కేంద్ర రక్షణశాఖలో ఆడిటర్ ఉద్యోగం సాధించాడు.

చుక్కనీరు తేకపోవడం సిగ్గుచేటు

(5వ పేజీ తరువాయి)



మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీ‌ష్‌రెడ్డి

కాళేశ్వరం ద్వారా సూర్యాపేట జిల్లాలోని తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాల పరిధిలోని సుమారు 2.50లక్షల ఎకరాలకు ఏడాదికి రెండు పంటలకు నీళ్ల ఇచ్చార ని అన్నారు. నాటి నీళ్లను చూ సిన ప్రస్తుత ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సూర్యాపేటకు వస్తున్న నీళ్ల కాళేశ్వరం నుంచి కాదని, అవి ఎస్సారెస్పీ నీళ్ల అన్నాడని, ఇప్పుడు ఎస్సారెస్పీ నుంచి ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. జల విధానంపై కాంగ్రెస్ నాయకులకు ఏమాత్రం అవగాహన లేదన్నారు. కృష్ణాజలాలను బీఆర్‌ఎస్ పాలనలో 36శాతం వినియోగిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం 24శాతం కూడా వినియోగించే తెలివిలేదని దుయ్యబట్టారు. కేసీఆర్ తప్పుచేస్తే నీళ్ల ఏవిధంగా వచ్చాయని, ఇప్పుడు ఎందుకు రావడం లేదో కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై రేవంత్‌కు వ్యతిరేకంగా బీజేపీ మాట్లాడడం లేదని, వారిది ఛోటేభాయ్.. బడేభాయ్ బంధం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై పంచపాండవుల మాదిరిగా కౌరవసైన్యంతో కేసీఆర్ సైన్యం పోరాడుతోందన్నారు. బీఆర్‌ఎస్‌కు ఉద్యమం, అధికారం, ప్రతిపక్షం కొత్తకాదని ప్రతీ తెలంగాణ బిడ్డ గుండె ధైర్యం గులాబీ జెండా అన్నారు. తెలంగాణ రాక ముందు ఎకరం భూమి ధర రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు ఉంటే అది రూ.20లక్షల నుంచి రూ.50లక్షల వరకు పెరిగిందన్నారు. దీంతో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ నాయకులు బాగా సంపాదించారనే అసూయ ప్రజల్లో వచ్చిందన్నారు.

ఆరు గ్యారెంటీలు గోవిందా.. గోవిందా..

కాంగ్రెస్ చూపిన ఆశలతో ప్రజలు నమ్మి ఓట్లు వేశారన్నారు. దేశపతి శ్రీనివాస్ రాసినట్లు ఆరు గ్యారెంటీలు గోవిందా... గోవిందా అంటూ వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని, లేకపోతే ఒక మంత్రి తొడ కోసుకుంటానని, మరో మంత్రి గొంతు కోసుకుంటానని అన్నారని గుర్తు చేశారు. రైతుల రుణమాఫీ విషయంలో సీఎం, డిప్యూటీ సీఎం మాటలకు పొంతన లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు 40సార్లు ఢిల్లీకి వెళ్లారని, రుణమాఫీ విషయంలో మిగిలిన డబ్బు రాహుల్, ప్రియాంక, ఖర్గే ఖాతాల్లో జమ చేశారని ఆరోపించారు. మాజీ మంత్రి జగదీ‌ష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కిశోర్‌కుమార్, మల్లయ్యయాదవ్ రైతుల కోసం నిరంతరం కాల్వల వెంట తిరుగుతూ కాళేశ్వరం నుంచి నీటిని తీసుకువచ్చి పంటలకు ఇచ్చారని తెలిపారు. ఆరు ఫీట్ల ఎత్తు ఉన్న నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నీళ్ల ఎందుకు తేలేకపోతున్నారని ప్రశ్నించారు. తెలంగాణలో మళ్లీ బీఆర్‌ఎస్ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ శ్రేణులపై ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా, బెదిరించినా భయపడకుండా పోరాడుతున్నారని, వారందరికీ శిరస్సువంచి నమస్కరిస్తున్నానన్నారు. దళితుల పక్షపాతి ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి అని, స్పీకర్‌ను అవమానించేలా మాట్లాడకపోయినా కావాలనే అసెంబ్లీ సమావేశాల నుంచి సస్పెండ్ చేశారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ రజతోత్సవం సందర్భంగా వచ్చే నెల 27న వరంగల్‌లో నిర్వహించే సభను చూసి కాంగ్రెస్, బీజేపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాలన్నారు. సభకు ప్రతీ గ్రామం నుంచి ముఖ్య నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రాల్లో ఉన్న పార్టీ కార్యాలయాలను చైతన్య కేంద్రాలుగా మార్చి కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలిపిన వ్యక్తి కేసీఆర్ : జగదీష్‌రెడ్డి

రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో మొదటి స్థానంలో నిలిపిన గొప్ప వ్యక్తి మాజీ సీఎం కేసీఆర్ అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చాక విద్యుత్ విషయంలో ఇబ్బందులు పెట్టాలని చంద్రబాబు, రేవంత్‌రెడ్డి ఎన్నో కుట్రలు చేశారని విమర్శించారు. కేసీఆర్‌కు పాలన చేతకాదని నిరూపించేందుకు ఎన్నో అడ్డంకులు సృష్టించారని తెలిపారు. అయినా కేసీఆర్ విద్యుత్ విషయంలో ఊహించని విధంగా సంస్కరణలు చేసి 24గంటల పాటు విద్యుత్‌ను అందించారన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ఉపాధి అవకాశాలను గమనించిన పక్క రాష్ట్రాల ప్రజలు కేసీఆర్ పాలనను వారి రాష్ట్రాల్లో కోరుకున్నారని అన్నారు. గుజరాత్‌లో కూడా విద్యుత్ విషయంలో అక్కడి ప్రజలు అక్కడి ప్రభుత్వాన్ని ప్రశ్నించారని గుర్తు చేశారు. కేసీఆర్ నాయకత్వాన్ని దేశమంతా కోరుకుంటోందన్నారు. రాష్ట్ర ప్రజలు మూడు పూటలా అన్నం తినేలా చేసిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు.

రాష్ట్రస్థాయి ఏకపాత్రాభినయం పోటీల్లో ప్రతిభ

● ద్వితీయ బహుమతి సాధించిన సత్యం



సత్యంను సన్మానిస్తున్న పెన్షనర్ల సంఘం నాయకులు

నల్లగొండ కల్చరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సాహిత్య, సాంస్కృతిక పోటీల్లో పెన్షనర్ల సంఘం మండల అధ్యక్షుడు గజవెల్లి సత్యం ప్రతిభ చాటారు. సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక విభాగం ఏకపాత్రాభినయం పోటీల్లో గజవెల్లి సత్యం రాష్ట్రస్థాయి ద్వితీయ బహుమతి అందుకున్నారు. గురువారం జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సత్యాన్ని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా ఆధ్వర్యంలో శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకట్‌రెడ్డి, జిల్లా శ్రీశైలం, యాద వాసుదేవ్, ఆంజనేయులు, సుధాకర్, రమేష్, శంకర్‌రెడ్డి, పుల్లయ్య, సంతోష్‌రెడ్డి, బాలరాజు, మోహన్‌రెడ్డి, అలీ తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచే బడ్జెట్



నల్లగొండ జిల్లా కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాలలో అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

(5వ పేజీ తరువాయి)

రోడ్లకు వచ్చేనెల 2న టెండర్లు పిలుస్తామన్నారు. జిల్లాలో రుణమాఫీ రూ.2,400కోట్ల మేర జరిగిందన్నారు. బడ్జెట్‌లో ప్రస్తావించని అంశాలను సైతం తమ ప్రభుత్వం చేపడుతుందని, జిల్లాను అన్ని రంగాల్లో మరింత ముందుకు తీసుకెళ్తామన్నారు. ఎస్‌ఎల్‌బీసీని పూర్తి చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వం జిల్లాలో 973 ఇళ్లు నిర్మించినా, ఏ ఒక్క గృహప్రవేశం చేయలేదన్నారు. తాము అధికారంలోకి వచ్చాక నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేశామన్నారు. వేసవిలో ఒక ఎకరం పం ట కూడా ఎండకుండా సాగునీరు ఇస్తున్నామని, తాగునీటికీ, విద్యుత్‌కు ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్ష నిర్వహించి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, స్థానిక నాయకులు ఉన్నారు.

మహిళలు చదువుకుంటే దేశం అభివృద్ధి

(ఆంధ్రజ్యోతి, నల్లగొండటౌన్): మహిళలు చదువుకుంటే కుటుంబంతోపాటు, సమాజం, దేశం అభివృద్ధి చెందుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాలలో రూ.కోటి ఎస్‌డీఎఫ్ నిధులతో నిర్మించిన అదనపు తరగతి గదులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇంటర్ విద్య జీవితాన్ని మార్చే సమయమని, సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదివి ఉన్నత స్థానంలోనికి రావాలన్నారు. రామగిరిలోని మహిళా డిగ్రీ కళాశాలను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని, అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. నిర్మాణంలో ఉన్న మరో నూతన బ్లాక్‌ను త్వరలో ప్రారంభిస్తామని, బయోటెక్నాలజీ ల్యాబ్‌ను పూర్తి చేయిస్తామన్నారు. ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా కూడా సౌకర్యాలు కల్పిస్తామన్నారు. విద్యార్థినులు సెల్ ఫోన్‌ను తక్కువగా వినియోగించాలని సూచించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాల్లో సాధికారత సాధించేందుకు విద్య చాలా ముఖ్యమన్నారు.

అనంతరం మంత్రి ఎస్‌ఎల్‌బీసీ కాలనీ ప్రభుత్వ మెడికల్ కళాశాల పక్కన మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించే పెట్రోల్ పంప్, రెస్టారెంట్ ఏర్పాటుకు స్థలాన్ని, ఎస్‌ఎల్‌బీసీ బత్తాయి మార్కెట్లో నిర్మాణంలో ఉన్న తాగునీటి వాటర్ ట్యాంక్‌ను పరిశీలించారు. కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్ శ్రీనివాసరాజు, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, ప్రతీక్ ఫౌండేషన్ చైర్మన్ గోనారెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్, మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలి

నల్లగొండటౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (టీయూఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ ముస్తాఫా కోరారు. గురువారం మంత్రి వెంకట్‌రెడ్డిని కలిసి ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, పింఛన్ ఇవ్వాలని కోరారు. ఈ మేరకు మంత్రి స్పందిస్తూ ఆ దిశగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

నాంపల్లి పంచాయతీ దుకాణాల వేలం

నాంపల్లి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో లైబజార్, గ్రామ పంచాయతీ పరిధిలో గల 4దుకాణాల నిర్వహణకు ఈ నెల 25న ఉదయం గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో బహిరంగవేలం నిర్వహించనున్నట్లు ప్రత్యేకాధికారి యూన్సీ తెలిపారు. ఈ వేలంపాటలో పాల్గొనే వారు 24వ తేదీ లోపు జీపీ కార్యాలయంలో రూ.5వేల నగదు చెల్లించి రశీదు పొందాలని తెలిపారు. అత్యధిక ధర పాడిన వారికి టెండర్ అందిస్తారని పేర్కొన్నారు.

బీసీల రిజర్వేషన్ చరిత్రాత్మక నిర్ణయం



క్లాక్‌టవర్ సెంటర్‌లో నిర్వహించిన సంబురాల్లో పాల్గొన్న బీసీ నాయకులు

నల్లగొండటౌన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ నిర్ణయం తీసుకోవడం చరిత్రాత్మక నిర్ణయమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, జాతీయ ఉపాధ్యక్షుడు మిర్యాల యాదగిరి అన్నారు. గురువారం పట్టణంలోని క్లాక్‌టవర్‌లో జ్యోతిబాపూలే విగ్రహం వద్ద బాణసంచా పేల్చి స్వీట్లు పంచి సంబరాలు నిర్వహించారు. ఎన్నో ఏళ్లుగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో బీసీలు చేస్తున్న పోరాటాన్ని గమనించి ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో పార్లమెంటులో ఈ బిల్లు పాస్ అయ్యే విధంగా కృషి చేసి బడుగు, బలహీన వర్గాల్లో వెలుగు నింపాలని కోరారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మునాస ప్రసన్నకుమార్, ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గూడూరు నారాయణయాదవ్, నాయకులు గుండు వెంకటేశ్వర్లు, జెరిపోతుల రమేష్‌గౌడ్, లక్ష్మీనారాయణ, సతీష్‌యాదవ్, నాగరాజు, శ్రీనివాస్, నాగరాజుయాదవ్, హరిబాబు పాల్గొన్నారు.

'ప్రాజెక్టులు పూర్తి చేయడంలో విఫలం'

చిట్యాలరూరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేయడంలో పాలకపక్షాలు ఘోరంగా విఫలమయ్యాయని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొంతల చంద్రారెడ్డి అన్నారు. చిట్యాల మండలం వెలిమినేడులో గురువారం సీపీఎం, రైతు సంఘం ఆధ్వర్యంలో ఎండిన వరి, మిర్చి పంటలను పరిశీలించి రైతుల వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉండటంతో భూగర్భజలాలు అడుగంటి రోజురోజుకు తగ్గిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. భూగర్భజలాలు అడుగంటుతుండటంతో సాగుకు నీరందడం లేదని అన్నారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో అరూరి శ్రీను, బొబ్బలి సుధాకర్‌రెడ్డి, లడె రాములు, నెలికంటి నర్సింహ, పంది నరేష్, మెట్టు నర్సింహ, సుర్కంటి మోహన్‌రెడ్డి, అరూరి శంభయ్య, లింగయ్య, యాదిరెడ్డి, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

● గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని వనిపాకల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మండల పంచాయతీ అధికారి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి రాజుకు అందజేశారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

కట్టంగూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నీరు లేక ఎండిపోయిన వరి పంటలను పరిశీలించి రైతులకు నష్ట పరిహారం అందించాలని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం ఎరసానిగూడెం, దుగినవెల్లి గ్రామాల్లో గురువారం కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమంలో భాగంగా ఎండిపోయిన వరి పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులు ఎకరానికి రూ. 40 వేల పెట్టుబడి పెట్టి వరి సాగు చేశారని, పంటలు ఎండిపోయి రైతులు కన్నీరు పెడుతున్నారన్నారు. ఎండిపోయిన పంటలను అధికారులు పరిశీలించి నష్టాన్ని అంచడంలో విఫలం చెందారని విమర్శించారు. ఎకరానికి రూ.30 వేల నష్ట పరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులులు నీలం నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు మండల ఎంకన్న, నాయకులు పాదూరి వెంకటరెడ్డి, పులకరం శంకర్, పబ్బు వెంకటేశ్వర్లు, గున్నాల నాగరాజు, బత్తిని నాగరాజు, గంజి అంజనేయులు, కొరివి నాగరాజు పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్ అమలు ఎప్పుడు..: ఏఐవైఎఫ్



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న తిర్వారి వెంకటేశ్వర్లు

నల్లగొండ రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్సీ జాబ్ క్యాలెండర్‌ను పూర్తి స్థాయిలో అమలు చేసి, నిరుద్యోగులకు న్యాయం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్వారి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన భగత్‌సింగ్ వర్ధంతి పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ రూపంలో ఒక అభయాన్ని ఇచ్చిందన్నారు. కానీ ఆచరణలో కాలయాపన చేస్తూ నిర్లక్ష్యం చేస్తోందన్నారు. టీజీపీఎస్సీ జాబ్ క్యాలెండర్‌ను అమలు చేయడంపై ప్రభుత్వం స్పందించకుంటే ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. మార్చి 23వ తేదీన భగత్‌సింగ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూడిద సురేష్, ఉపాధ్యక్షుడు గద్దం నవీన్, నాయకులు షరీఫ్, బండారు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎండుతున్న పంటలు

- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- దిక్కుతోచని స్థితిలో రైతన్నలు
- ట్యాంకర్ల ద్వారా కాపాడుకునే యత్నం



ఎండిపోయిన వరి పొలంలో గేదెలను మేపుతున్న రైతు

మర్రిగూడ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి సాగుచేసిన పంట నీటి కొరతతో ఎండిపోతుంది. వేసవికాలం ప్రారంభ దశలోనే భూగర్భజలాలు మెలమెల్లగా అడుగంటుతున్నాయి. దీంతో సాగుచేసిన భూములకు నీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది రైతులు పంటలు కాపాడుకోవడం కోసం ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు పొలాలకు తరలిస్తున్నారు. మరోపక్క ఎండిన పొలంలో పశువులను మేపుకుంటున్నారు. మర్రిగూడ మండలం ఆయకట్టు ప్రాంతం కాకపోయినా రైతులు ఎక్కువగా బోరు బావులనే నమ్ముకొని వరి సాగు చేశారు. ఆరుగాలం శ్రమించి పంట చేతికొచ్చే సమయంలో ఎండల తీవ్రతతో నీరందక ఎండిపోయే దశకు చేరుకోవడంతో రైతుల ఆశలు ఆవిరై పోతున్నాయి. పొట్టకు వచ్చే దశలోనే బోరు బావుల్లో భూగర్భజలాలు అడుగంటి పోవడంతో ఎండిపోతున్న పంటలతో తల్లడిల్లిపోతున్నారు. మండలంలో 4,380 ఎకరాల వరకు వరి పంట సాగు చేశారు. ఇప్పటికే భూగర్భజలాలు అడుగంటి పోవడంతో 250 ఎకరాల వరకు వరి పొలాలు ఎండిపోయాయని వ్యవసాయ అధికారులు అంచనా వేసినట్లు ప్రాథమిక సమాచారం.

మండలంలోని తిరుగండ్లపల్లి, తమ్మడపల్లి, అజలాపురం, యరగండ్లపల్లి, కొండూర్, కొండూర్ తండా, మర్రిగూడ, రాజుపేట తండా, రాంరెడ్డిపల్లి, వట్టిపల్లి, బట్టపల్లి గ్రామాల్లో వరి పంటలు నీళ్ల లేక ఎండిపోతున్నాయి. యరగండ్లపల్లి గ్రామానికి చెందిన పంగ శ్రీను, పంగ యాదయ్య ఇద్దరు అన్నదమ్ములు కలిసి మూడు బోర్లు ఉన్నాయని, 7 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఎండ తీవ్రంగా ఉండటం వల్ల నీరు అందక వరిపంట ఎండిపోయే దశకు చేరుకుంది. రూ. 8 లక్షలు పెట్టి ఒక నెలలోనే నాలుగు బోర్లు వేశారు. నీరందకపోవడంతో పొట్ట దశలోనే సుమారు 6 ఎకరాల వరి పంట పూర్తిగా ఎండిపోయింది. కేవలం ఒక ఎకరం మాత్రమే నీరు పారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మరో రైతు యెన్నమనేని దామోదర్‌రావు 3 ఎకరాల్లో సాగు చేశారు. అతనికి ఉన్న రెండు బోర్లు అకస్మాత్తుగా తగ్గుముఖం పట్టడంతో 20 రోజుల్లో వరి కోతకు వచ్చే సమయంలో నీరందడం లేదు. ఎలాగైనా పంటను కాపాడుకోవాలని రెండు ట్రాక్టర్లను కిరాయికి తీసుకుని పంట పొలాలకు నీటిని పెడుతున్నారు. నీరందక వరి పంట ఎండిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏప్రిల్‌లో రావాల్సిన ఎండలు మార్చి నెలలోనే రావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

ఏడు ఎకరాలు వరి సాగు చేశాను



నాకు ఉన్న మూడు బోర్లను నమ్ముకొని ఏడుఎకరాల వరకు వరి సాగు చేశాను. అకస్మాత్తుగా భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో మరో నాలుగు బోర్లను వేశాను. నీళ్ల పడక పోవడంతో 6ఎకరాలు పూర్తిగా ఎండిపోయింది. సుమారు రూ.8లక్షల వరకు పెట్టుబడి పెట్టిన ఫలితం లేదు. పంట ఎండిపోవడంతో పశువులను మేపుతున్నాను.

● పంగ శ్రీను, రైతు, యరగండ్లపల్లి

ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నా



నాకు ఉన్న మూడు ఎకరాల్లో వరి సాగు చేశాను. 20 రోజుల్లో కోతకు వచ్చే వరి పంట నీళ్ల లేక ఎండిపోయే దశకు చేరుకుంది. ఎలాగైనా పంటను కాపాడుకోవాలని నీటి ట్యాంకులను కిరాయికి తీసుకొని ట్యాంకర్ల ద్వారా నీటిని పంట పొలానికి అందజేస్తున్నాను. ఇప్పటి వరకు రూ.2లక్షల వరకు ఖర్చు చేశాను.

● యెన్నమనేని దామోదర్‌రావు, రైతు, రాంరెడ్డిపల్లి

పొలాలకు నీరు అందించాలి

నల్లగొండ, మార్చి20(ఆంధ్రజ్యోతి): డి-40 కాల్వ ఆయకట్టుకు సాగునీరందించాలని పలువురు రైతులు కోరారు. గురువారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. డి-40 కాల్వ గ్రామాలైన సిలార్‌మియాగూడెం, మలునరాజగూడెం, ఇందుగుల, గుర్రప్పగూడెం, చిన్నగూడెం, పుచ్చకాయలగూడెం, సీత్యాతండా పరిధిలోని పంటపొలాలు చేతికి అందే సమయంలో నీరు లభించక పొలాలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల నీరు విడుదల చేసినా అక్కడ ఎల్-11 కాల్వ గేటు తెరిచి ఉండటం వల్ల చివరి గ్రామాలకు నీరందలేదని వాపోయారు. దీని మూలంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నీరు అందించి ఆదుకోవాలని కోరారు.

సొసైటీ అభివృద్ధే లక్ష్యం

మర్రిగూడ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సొసైటీ అభివృద్ధే లక్ష్యంగా పాలక వర్గం పని చేస్తుందని శివన్నగూడ సహకార పరపతి సంఘం చైర్మన్ బాలంనర్సింహ అన్నారు. సొసైటీ కార్యాలయంలో గురువారం రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాలకవర్గం, రైతులు సొసైటీ అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ ఏడాది 2025-26కు సొసైటీకి సంబంధించిన 14 ఎకరాల భూమి కౌలుకు సంబంధించిన వేలంలో రైతులు పాల్గొన్నారు. శివన్నగూడ గ్రామానికి చెందిన పంగ పర్వతాలు రూ.3లక్షల50వేలకు వేలం దక్కించుకున్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ యాదగిరిరావు, వంగాల రవీందర్‌రెడ్డి, పొగాకు నర్సింహ, మేతరి ఎల్లయ్య, తోటకూర ఎల్లయ్య, రాములు, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



కేతేపల్లి జడ్పీ పాఠశాలలో పది పరీక్షలకు ఏర్పాట్లు చేస్తున్న ఉపాధ్యాయులు

మునుగోడు, శాలిగౌరారం, కేతేపల్లి, మర్రిగూడ, కనగల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మునుగోడులో పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల పరిధిలోని హైస్కూల్‌లు, గురుకులాలు, ప్రైవేట్ స్కూళ్లకు చెందిన 407 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణం గా రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండల కేంద్రం లోని హైస్కూల్‌లో 180 మంది, సెయింట్ జోసఫ్ స్కూల్‌లో 227 చొప్పున పరీక్షలు రాయనున్నారు. ఈ సందర్భంగా ఎంఈవో మల్లేషం మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు ఎలాంటి వత్తిడి, ఆందోళనకు చెందకుండా పరీక్షలు రాయాలని సూచించారు.

● శాలిగౌరారం మండలంలో పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో సైదులు తెలిపారు. మండలంలో మొత్తం 278మంది విద్యార్థులకు మూడు సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్ఐ సైదులు తెలిపారు.

● కేతేపల్లి మండలంలోని రెండు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలోని పలు పాఠశాలలకు చెందిన 342మంది విద్యార్థులు పరీక్ష రాయడానికి ఏర్పాట్లు చేశారు. మండలంలోని రెండు పరీక్షా కేంద్రాల్లోనూ విద్యార్థులకు అవసరమైన ఏర్పాట్లు చేశామని ఎంఈవో ఎ.రాజేంద్రప్రసాద్ తెలిపారు. విద్యార్థులు నిర్ణీత సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఆయన సూచించారు.

● మర్రిగూడ పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మర్రిగూడ ఎంఈవో శ్రీనివాస్ తెలిపారు. మండలంలో 7 జడ్పీ హైస్కూళ్లకు గాను 266మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు.

● కనగల్‌లో పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో పద్మ, పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ యాదగిరి, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ మహ్మద్ ఎజాస్ తెలిపారు. మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 246 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు.

శాలిగౌరారానికి ఇండోర్ స్టేడియం మంజూరు

శాలిగౌరారం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలకేంద్రానికి ఇండోర్ స్టేడియం మంజూరైంది. దీని నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలాన్ని సేకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం తహసీల్దార్ యాదగిరికి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా యువజన, క్రీడల అధికారి కుంభం నర్సిరెడ్డి తహసీల్దార్ యాదగిరిని కలిసి కలెక్టర్ ఆదేశాల పత్రాలను అందజేశారు. శాలిగౌరారం మండల కేంద్రంలో ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ప్రతిపాదనలను కలెక్టర్ ఇలా త్రిపాఠికి పంపించింది. ఇందు కోసం 20 గుంటల ప్రభుత్వ స్థలం సేకరించాలని తహసీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. వారం రోజుల్లో ప్రభుత్వ స్థలాన్ని గుర్తించేందుకు ఆర్ఐ అజారుద్దీన్‌ను తహసీల్దార్ యాదగిరి ఆదేశించారు. శాలిగౌరారంలో ఇండోర్ స్టేడియం మంజూరు కావడంపై క్రీడాకారులు, యువకులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రంజాన్‌ను శాంతియుతంగా నిర్వహించుకోవాలి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న దైద రవీందర్

నకిరేకల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పవిత్రమైన రంజాన్‌ను ముస్లింలు శాంతియుతంగా నిర్వహించుకోవాలని హిందువులు, ముస్లింలు కలిసి ఐక్యతతో ఉండాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు దైద రవీందర్ అన్నారు. నకిరేకల్‌లో గురువారం సాయంత్రం పట్టణంలోని చీమలగడ్డలోని మసీదులో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గార్లపాటి రవీందర్‌రెడ్డి, ఎండీ. యూసుఫ్, ఎండీ.జాని, ఎండీ.జలాల్, షరీఫ్, ఉద్దిన్, గుల్షన్‌వలి, సైదులు, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థులకు నియామక పత్రాల అందజేత

నల్లగొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కారుణ్య నియామకాలకు సంబంధించి హైదరాబాద్‌లో జాయినింగ్ ఆర్డర్ అందుకోవడం కోసం జిల్లా పరిషత్ నుంచి పలువురు అభ్యర్థులు బస్సులో తరలివెళ్లారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమానికి వీరంతా వెళ్లారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డితో పాటు కొప్పు రాంబాబు, నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

● పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్‌లో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న 582 మంది అభ్యర్థులకు కారుణ్య నియామకాలు కల్పించినందుకు పంచాయతీరాజ్ మినీస్ట్రీరియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏపాల సత్యనారాయణరెడ్డి ప్రభుత్వానికి ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

బడ్జెట్‌లో బీసీలకు మొండిచేయి : బీసీ సంఘం

నల్లగొండటౌన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రభుత్వం బీసీలకు మొండి చేయి చూపించదని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు అన్నారు. పట్టణంలోని బీసీ భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల జనాభా దామాషా ప్రకారం రూ.50వేల కోట్లు కేటాయించాల్సి పోయి కేవలం రూ.11,405 కోట్లు మాత్రమే కేటాయించడం అన్యాయమన్నారు. చాలీచాలని బడ్జెట్‌తో బీసీలు ఎలా అభివృద్ధి చెందుతారని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి ప్రభుత్వాలు బీసీలకు అన్యాయం చేస్తూనే ఉన్నాయని అన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో పెట్టిన బిల్లును ఆమోదింపజేసిన ప్రభుత్వానికి సంఘం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. దీనిని పార్లమెంట్‌లో కూడా చట్టబద్ధత కల్పించే వరకు కృషి చేయాలని అన్నారు. సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు కంది సూర్యనారాయణ, ప్రధానకార్యదర్శి నేలపట్ల సత్యనారాయణ, నాయకులు నల్లసోమ మల్లన్న, గోలి విజయ్‌కుమార్, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు చొల్లేటి రమేష్, గుండా కోటప్ప తదితరులు పాల్గొన్నారు.

కూలీలు జాగ్రత్తలు పాటించాలి

శాలిగౌరారం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ ఉపాధి హామీ కూలీలు కొలతల ప్రకారమే పనులు చేయాలని ఎంపీడీవో గార్లపాటి జ్యోతి లక్ష్మి అన్నారు. మండలం పెర్కకొండారంలో గురువారం ఉపాధి హామీ పనులను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ పథకంలో లబ్ధిపొందుతున్న సన్న, చిన్నకారు రైతులు వేసిన మునగ, నిమ్మ తోటలను, ఫారం పాంపాండ్‌లను కూడా ఆమె పరిశీలించారు. సన్న, చిన్నకారు రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జ్యోతి లక్ష్మి మాట్లాడుతూ కొలతల ప్రకారం పనిచేస్తే రూ.300లు వస్తాయన్నారు. ఎండ ఎక్కువ కాకముందే పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఎక్కువ నీరు తాగాలని సూచించారు. ఆమె వెంట ఈసీ విశ్వనాథుల వెంకటాచారి, టెక్నికల్ అసిస్టెంట్ ఎన్.నరేష్, ఎ.సత్యనారాయణ, రవికిరణ్, జి. విక్రమ్, శోభ, పంచాయతీ కార్యదర్శి లక్ష్మారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ ఉపేందర్, రైతులు బొబ్బిలి జాన్ తదితరులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి

మునుగోడు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): సమాజంలో యువత, విద్యార్థులు స న్మార్గం వైపు పయనించాలని డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కట్ట లింగస్వామి అన్నారు. మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ- డీవైఎఫ్ఐ సంయుక్తంగా పోలీసులతో కలిసి గురువారం మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావిభారత పౌరులుగా ఎదుగాల్సిన యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడి బానిసలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చర్యలు సమాజ భవిష్యత్తు మనుగడకు పూర్తి విఘాతమని వాపోయారు. యువత, విద్యార్థులు డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు, బెట్టింగ్‌లకు వ్యతిరేకంగా పోరాడాలని అన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటయ్య, హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి, సంఘాల నాయకులు బొడ్డుపల్లి నరేష్, రాణి, వంశీకృష్ణ, యాట శ్రీకాంత్, చెనగోని గణేష్, మధు, మధుకర్, భానుప్రకాష్, శశి విద్యార్థులు పాల్గొన్నారు.

సాయిబాబాను దర్శించుకున్న విద్యార్థులు



వట్టిమర్తి శివారులోని సాయిబాబా దర్శించుకున్న విద్యార్థులు

చిట్యాలరూరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): చిట్యాల మండలం వట్టిమర్తి శివారులో జాతీయ రహదారి పక్కన గల షిర్డీ సాయిబాబా మందిరాన్ని 10వ తరగతి విద్యార్థులు గురువారం దర్శించుకున్నారు. 10వ తరగతి వార్షిక పరీక్షలు ఈనెల 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో చిట్యాలకు చెందిన గ్రీన్‌గ్రోవ్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సాయిబాబాను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరీక్షలను తాము ఎలాంటి ఆందోళన చెందకుండా ఇబ్బందులు లేకుండా సంతోషంగా రాసేలా దీవించాలని మొక్కుకున్నారు. మందిరానికి వచ్చిన భక్తులు విద్యార్థులు పరీక్షలు మంచిగా రాయాలని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనిత, మధు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

● కేతేపల్లి :మండలంలోని గుడివాడ గ్రామానికి చెందిన రాచూరి వెంకన్న అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడికి ఎమ్మెల్యే వేముల వీరేశం సహ కారంతో రూ.5లక్షల ఎల్‌వోసీ మంజూరైంది. సంబంధిత మంజూరు పత్రాన్ని ఎమ్మెల్యే నివాసంలో అందజేశారు.

● కనగల్ : మండలంలోని లింగాలగూడెం గ్రామంలో రూ.5 లక్షల ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. గోలి జగాల్‌రెడ్డి, రాజారెడ్డి, నర్సింహ మహేష్, నాగరాజు తదితరులున్నారు.

● మునుగోడు రూరల్ : మండలంలోని పలివెల గ్రామానికి చెందిన వరికుప్పల లక్ష్మమ్మకు సీఎం సహాయ నిధి నుంచి రూ.16 వేలు మంజూరయ్యాయి. సంబంధిత చెక్కులను కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు బాసరాజు యాదగిరి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఆనగంటి కృష్ణ చిఫలమెట్ల శివ తదితరులు పాల్గొన్నారు.

● కేతేపల్లి: మండలంలోని బొప్పారం గ్రామం నుంచి మూసీ ప్రాజెక్టు దిగువన గల బీసీ బాలుర గురుకుల పాఠశాల వరకు బీటీ రోడ్డు వేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై పోటుబాట కార్యక్రమంలో భాగంగా సీపీఎం నాయకులు గురువారం మండలంలోని బొప్పారం గ్రామంలో పర్యటించి స్థానికుల నుంచి సమస్యలు సేకరించారు. అనంతరం స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయితీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి సీహెచ్.లూర్దుమారయ్య, నాయకులు చౌగోని నాగయ్య, సుంకరి సత్తయ్య, జి.భాగ్యమ్మ, నఅలం సైదులు, సోమయ్య, ఎల్లమ్మ పాల్గొన్నారు.

● నకిరేకల్ : హైదరాబాద్ నుంచి సూర్యాపేటకు వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు గురువారం నకిరేకల్ బైపాస్ రోడ్డులో బీఆర్ఎస్ కార్యకర్తలు స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నలగాటి ప్రసన్న రాజ్ వేర్వేరుగా కేటీఆర్‌కు స్వాగతం పలికారు.

● శాలిగౌరారం : శాలిగౌరారంలోని ఎస్సీ కాలనీలో పేద కుటుంబానికి చెందిన యువకుడు ఈర్ల సైదులు (35) ఇటీవల గుండెపోటుతో మరణించాడు. అతడి కుటుంబాన్ని చైత్ర ఫౌండేషన్ చైర్మెన్ యంగలి రామకృష్ణ గౌడ్ సైదులు కుటుంబాన్ని పరామర్శించి రూ. 10 వేలు అందజేశారు.

● మర్రిగూడ : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంను గురువారం నల్లగొండలో సీపీఐ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు తిరుమలేష్ మాదిగ , సురేష్, యాదగిరి, మహేందర్, శేఖర్‌లు ఉన్నారు.

● నల్లగొండ రూరల్ పీఎంశ్రీ కేవి అడ్మిషన్ కోసం ఈ నెల 21 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చునని కేంద్రీయ విద్యాలయంప్రిన్సిపల్ శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి25, 26 తేదీల్లో లాటరీ ద్వారా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లకు రంగం సిద్ధం

(5వ పేజీ తరువాయి)

మాత్రమే ప్రభుత్వరంగ సంస్థలు కొనుగోలు చేశాయి. మిల్‌పాయింట్ల వద్ద సుమారు 8లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు జరిగింది. ఈ యాసంగి సీజన్‌లో నల్లగొండ జిల్లాలో 71, సూర్యాపేట జిల్లాలో 88 సన్నధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని పౌరసరఫరాల శాఖ అధికారులు నిర్ణయించారు.

సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులు

యాసంగి సీజన్‌లో ఇతర జిల్లాల నుంచి అనధికారికంగా ధాన్యం రాకుండా కట్టడి చేసేందుకు స రిహద్దుల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ప్రధానంగా సూర్యాపే ట, నల్లగొండ జిల్లాల్లో రెవెన్యూ, పోలీస్ అధికారులు సంయుక్తంగా చెక్‌పోస్టులు ఏర్పాటుకు ప్రాంతాలను గుర్తించారు. నల్లగొండ జిల్లాలోని నాగార్జునసాగర్, వాడపల్లి, సూర్యాపేట జిల్లాలోని మఠంపల్లి, కోదాడ ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు.

ప్రభుత్వరంగ సంస్థలకు భారీ లక్ష్యం

ఉమ్మడి జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వరంగ సంస్థలకు కలెక్టర్లు భారీ లక్ష్యం నిర్దేశించారు. రైతులు స్వచ్ఛందంగా మిల్లర్లకు, వ్యాపారులకు విక్రయిస్తే అభ్యంతరం లేదని, కానీ కొనుగోలు కేంద్రాలకు వస్తే ప్రతీ గింజను కొనుగోలు చేయాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే ప్రతిపాదిత కేంద్రాలను గుర్తించడంతో పాటు, కేంద్రాల్లో అవసరమైన టార్పాలీన్లు, టెంట్లు, తేమ కొలిచే యంత్రాలు, కాంటాలను అందుబాటులోకి తెచ్చేందు కు ఆదేశాలిచ్చారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 29.19మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రా నుండగా, అందులో 26.76 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వరంగ సంస్థలు కొనుగోలు చేయాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించారు.

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.120	180	200
సూర్యాపేట	రూ.95	140	170
నల్లగొండ	రూ.100	145	180

ఉష్ణోగ్రత గరిష్ఠం 37.0 । కనిష్ఠం 20.0

ఉగాది నుంచి సన్నబియ్యం

మట్టపల్లిలో సమీక్షా సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లిలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మఠంపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినం రోజు నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ ఒక్కరికి ఆరు కిలోల చొప్పున నాణ్యమైన సన్నబియ్యం ఉచితంగా ఇస్తామని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామిని మంత్రి ఉత్తమ్, కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్, మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిలతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో ధర్మకర్తలు వారికి స్వాగతం పలికారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనం చేసి స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు. అనంతరం మట్టపల్లి ఆర్యవైశ్య సత్రంలో మంత్రి ఉత్తమ్ సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రముఖ పుణ్యక్షేత్రం మట్టపల్లి నుంచి రాష్ట్రంలోని 84శాతం జనాభా కు నాణ్యమైన సన్న బియ్యం ఇచ్చే పవిత్ర కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించామన్నారు. గతంలో రేషన్ దుకాణాల ద్వారా పంపిణీచేసిన బియ్యాన్ని ప్రజలు తినకుండా రూ.5కే కోళ్లఫాం, మిల్లర్లకు విక్రయించేవారన్నారు. రేషన్ బియ్యం పంపిణీ దుర్వినియోగాన్ని గుర్తించి నిరుపేదల ఆకలి తీర్చేందుకు సన్న బియ్యం ఇచ్చి విప్లవాత్మక మార్పు తీసుకువస్తున్నామన్నారు. ప్రజా ప్రభుత్వం ఎన్నికైన మొదటి రోజు నుంచే ప్రజలకు ఉపయోగపడే అద్భుత పాలన అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ, ఎస్పీ నరసింహ, అదనపు కలెక్టర్ పి.రాంబాబు, ఆర్డీవో శ్రీనివాసులు, ఈవో నవీన్, తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేట జిల్లా కేంద్రంలో మాట్లాడుతున్న కేటీఆర్



నీళ్ల మంత్రి ఉన్నా.. చుక్కనీరు తేకపోవడం

సిగ్గుచేటు

సూర్యాపేట(కలెక్టరేట్), మార్చి 20, (ఆంధ్రజ్యోతి): నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందినా, రైతులకు చుక్కనీరు తేలేకపోయారని, రాష్ట్రంలో ప్రస్తుతం నీళ్ల లేక పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువని, కేవలం కేసీఆర్‌పై కోపంతో కావాలనే కాళేశ్వరాన్ని ఖాళీ చేసి రైతులకు నీళ్ల ఇవ్వకుండా పంటలు ఎండిపోయేలా చేశారని అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాజెక్టుల్లో నీళ్ల ఉన్నా పంటలకు నీళ్ల ఇవ్వలేదని విమర్శించారు. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో మిగతా 7వ పేజీలో...

- కేసీఆర్‌పై కోపంతోనే కాళేశ్వరాన్ని ఖాళీ చేశారు
- ప్రాజెక్టుల్లో నీళ్లు ఉన్నా చెరువులు నింపని కాంగ్రెస్
- వరంగల్ సభకు లక్షలాదిగా తరలిరావాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

చరిత్రలో నిలిచే బడ్జెట్

నల్లగొండలో విలేకరుల సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్లగొండ జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్రపవార్

నల్లగొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ చరిత్రలో నిలిచిపోయేదిగా ఉందని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీశాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. అందరికీ ప్రభుత్వ ఫలాలు అందించేలా బడ్జెట్ ఉందన్నారు. ఇరిగేషన్‌కు పెద్దపీటవేశారని, అందులో నల్లగొండ జిల్లాకు ప్రాధాన్యం దక్కిందన్నారు. జిల్లాలో ఈ యాసంగిలో లక్ష ఎకరాల ఆయకట్టు పెరిగిందని, ధాన్యం దిగుబడి పెరగనున్నందున రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేస్తామన్నారు. బ్రాహ్మణవెల్లంలకు బడ్జెట్లో రెండింతలు నిధులు పెంచారని, రిజర్వాయర్‌లో నీళ్ల నింపడం ద్వారా భూగర్భ జలాలు పెరిగాయన్నారు. కాల్వలు, ప్రాజెక్టు పనుల పూర్తికి రూ.కోట్లు విడుదల చేశారని, డిసెంబరు నాటికి లక్ష ఎకరాలకు నీరివ్వాలన్న లక్ష్యాన్ని పూర్తిచేస్తామన్నారు. ఎస్ఎల్‌బీసీ ప్రమాదం జరిగి ఎనిమిది మంది మృతిచెందడం బాధాకరమన్నారు. రూ.11వేల కోట్లతో 58 ఇంటిగ్రేటెడ్ పాఠశాలు ఒక్కొక్కటి రూ.200కోట్లతో నిర్మిస్తున్నామన్నారు. వృత్తి విద్య, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఏటీసీలను మంజూరు చేశామని, నల్లగొండలో రూ.75కోట్లతో నిర్మించిన ఏటీసీలు సిద్ధంగా ఉన్నాయన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు స్కిల్ యూనివర్సిటీలతోపాటు జాబ్ మేళాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆర్ అండ్‌బీ ఆధ్వర్యంలో రూ.5,900 కోట్లతో 12,000కిలోమీటర్ల మిగతా 7వ పేజీలో...

ధాన్యం కొనుగోళ్లకు రంగం సిద్ధం



- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,053 కేంద్రాలు
- సన్నధాన్యానికి ప్రత్యేక కొనుగోలు కేంద్రాలు
- 26.76లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం

నల్లగొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు రంగం సిద్ధమవుతోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈ సీజన్‌లో దొడ్డురకాల ధాన్యంతో పాటు, సన్నరకాలను కూడా ప్రభుత్వరంగ సంస్థల ద్వారా కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ముందస్తుగా బోరుబావుల కింద సాగుచేసిన వరి కోతలు మొదలవడంతో ధాన్యం మిల్లులకు వస్తోంది. మరోవైపు నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లోని నాగార్జునసాగర్ ఆయకట్టు ప్రాంతాల్లో ఇప్పుడిప్పుడే కోతలు ప్రారంభమవగా, ఏప్రిల్ రెండోవారం నుంచి ముమ్మరమవనున్నాయి. సూర్యాపేట జిల్లాలోని ఎస్ఆర్ఎస్పీ ఆయకట్టు కింద కూడా దాదాపు ఇదే పరిస్థితి ఉంది. మరోవైపు యాదాద్రి, సూర్యాపేట జిల్లాల్లోని మూసీ ఆయకట్టు ప్రాంతాల్లో ఏప్రిల్ మొదటివారం నుంచి కోతలకు ప్రారంభమయ్యే అవకాశముందని అంచనా. ఉమ్మడి జిల్లాలో ఈ సీజన్‌లో 12.85 లక్షల ఎకరాల్లో యాసంగి వరి సాగుకాగా, సుమారు 29.19లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేసిన అధికార యంత్రాంగం అందుకు 1,053 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

సన్నధాన్యం కొనుగోలకు ప్రత్యేక కేంద్రాలు

ఉగాది నుంచి రేషన్‌కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో ప్రభుత్వం యాసంగిలోనూ సన్నధాన్యం సాగుచేయాలని రైతులను కోరింది. అందుకు ప్రోత్సాహకంగా యాసంగిలోనూ సన్నధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, అక్కడ ధాన్యం విక్రయించిన రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో యాసంగిలోనూ సన్నరకాల సాగు గణనీయంగా జరిగింది. నల్లగొండ జిల్లాలో 2.55లక్షల ఎకరాల్లో, సూర్యాపేట జిల్లాలో 2.40లక్షల ఎకరాల్లో మొత్తం సుమారు ఐదు లక్షల ఎకరాల్లో యాసంగిలో సన్నధాన్యం సాగయినట్టు అంచనా. యాదాద్రి జిల్లాలో సన్నాల సాగు జరగలేదని, ఎక్కడన్నా రైతులు అతి స్వల్పంగా ఎకరం, రెండెకరాల్లో సాగుచేసినా అది విక్రయానికి రాదని, సొంత అవసరాలకే వినియోగించుకుంటారని అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తంగా ఈ యాసంగిలో సుమారు 12లక్షల మెట్రిక్‌టన్నుల వరకు సన్నధాన్యం ఉత్పత్తి వస్తుందని అంచనా వేస్తున్న అధికార యంత్రాంగం వీలైనంత వరకు కొనుగోలు చేయాలని భావిస్తోంది. అయితే మిల్లర్లు ప్రభుత్వ కనీస మద్దతు ధర కంటే ఎక్కువ ధర ఇస్తే మిల్‌పాయింట్ల వద్దనే రైతులు సన్నధాన్యం విక్రయిస్తుండటంతో వానాకాలం సీజన్‌లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు సన్నధాన్యం ఆశించినరీతిలో రాలేదు. ఒక్క నల్లగొండ జిల్లాలో వానాకాలం సీజన్‌లో 80వేల క్వింటాళ్ల సన్నధాన్యం మిగతా 8వ పేజీలో...

జిల్లా	సాగు (ఎకరాల్లో)	ఉత్పత్తిఅంచనా (మె.ట)	కొనుగోళ్ల లక్ష్యం	కొనుగోలు కేంద్రాలు
నల్లగొండ	5,14,031	12,14,449	11,26,021	375
సూర్యాపేట	4,73,000	12,05,396	11,00,000	308
యాదాద్రి	2,98,912	5,00,000	4,50,000	370
మొత్తం	12,85,943	29,19,845	26,76,021	1,053

కోతుల వల్లే విద్యుత్ ప్రమాదం



ప్రమాద ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఈ నరేష్‌బాబు

● రూ.5 లక్షల వరకు నష్టం : సాగర్ ప్రాజెక్టు సీఈ అజయ్‌కుమార్

నాగార్జునసాగర్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రధాన డ్యాం వద్ద బుధవారం జరిగిన అగ్ని ప్రమాదం కోతులు విద్యుత్ తీగలను కదిలించడం వల్ల స్పార్క్ వచ్చి షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఉండవచ్చని సాగర్ ప్రాజెక్టు సీఈ అజయ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన ఈఈ మల్లిఖార్జున్‌రావుతో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రమాదం జరిగిన స్థలంలో కిలోమీటరు మేర కార్పెట్ గడ్డితో పాటు సీసీ కెమెరాల కేబుళ్లు కాలిపోయినట్లు తెలిపారు. సీసీ కెమెరాలు ఎంత వరకు బాగున్నాయని సాంకేతిక నిపుణులు పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రమాదంతో సుమా రు రూ.3నుంచి రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లి ఉంటుందని అంచ నా వేశారు. అధికారులు పూర్తి స్థాయిలో పరిశీలించి ఒకటి రెండు రోజుల్లో పూర్తిగా నష్టం ఏ మేరకు వాటిల్లిందో అంచనా వేయనున్నట్లు తెలిపారు. మరల ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు కేబుళ్ల చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. వారి వెంట ఎస్పీఎఫ్ ఆర్ఐలు శ్రీనివాస్‌రావు, ప్రతాప్‌నాయుడు, ప్రాజెక్టు ఇంజనీర్లు సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ఉన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:32 (శుక్రవారం సాయంత్రం)

సహర్: 4:57 (శనివారం ఉదయం)

రోడ్డు ప్రమాదాల నివారణకు

అంతా కృషి చేయాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



నల్లగొండ రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి రోడ్డు భద్రతా సమావేశంలో ఆమె మాట్లాడారు. వాహనాలు నడిపే వారి నిర్లక్ష్యం, రోడ్డు భద్రతా నియమాలు పాటించకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. దీంతో విలువైన ప్రాణాలు పోతున్నాయన్నారు. రహదారులపై ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉన్న ప్రాంతాలను గుర్తించాలన్నారు. పోలీస్‌శాఖ సూచనల మేరకు ఆయా ప్రదేశాల్లో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉద్యోగ ధర్మంతో పాటు, సామాజిక బాధ్యతగా రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. గ్రామాల్లోని రహదారులను పంచాయతీ నిధుల ద్వారా మరమ్మతు చేయిస్తామన్నారు. పోలీస్‌శాఖ తీసుకున్న చర్యల ఫలితంగా జిల్లాలో బ్లాక్ స్పాట్లు 60 నుంచి 40కి తగ్గాయన్నారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులను ఆమె అభినందించారు. ఎస్పీ శరత్‌చంద్రపవార్ మాట్లాడుతూ, జాతీయ రహదారుల సమీపంలోని గ్రామాల్లో రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాలకు అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు. మర్రిగూడ బైపాస్ ఫ్లై ఓవర్ వద్ద రోడ్డు పనుల కారణంగా ట్రాఫిక్‌జాం అవుతోందని, ఇక్కడ ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉన్నందున, పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కృషిచేసిన పోలీస్, ఆర్అండ్‌బీ, ఎన్‌హెచ్‌ఏ అధికారులకు ఈ సందర్భంగా ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రోడ్లు భవనాల శాఖ, జాతీయ రహదారుల సంస్థ అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు



జిల్లా కేంద్రంలో ఓ కేంద్రంలో హాల్ టికెట్ నంబర్ల కేటాయింపును పరిశీలిస్తున్న డీఈవో భిక్షపతి

నల్లగొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈనెల 21 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేస్తారు. జిల్లాలో 105 రెగ్యులర్, మూడు ప్రైవేట్ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 18,825మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. అందులో 18,666మంది రెగ్యులర్ 159మంది ప్రైవేట్‌గా పరీక్షలు రాయనున్నారు. 9,669మంది బాలురు, 8,997మంది బాలికలు హాజరుకానున్నారు. నిమిషం నిబంధనను సడలిస్తూ అదనంగా 5నిమిషాల వరకు పరీక్షకు హాజరయ్యేందుకు అవకాశం కల్పిస్తున్నారు. ప్రతీ విద్యార్థి పరీక్ష కేంద్రాలకు గంట ముందుగానే చేరుకోవాలని విద్యాశాఖ అధికారులు సూచిస్తున్నారు. పరీక్ష నిర్వహణకు 105మంది సీఎస్‌లను, మరో 105మంది డీవోలను, 986మంది ఇన్విజిలేటర్లను నియమించారు. పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులతో పాటు సీఎస్‌లు, డీవోలు సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావద్దని విద్యాశాఖాధికారులు స్పష్టం చేశారు.

పటిష్ఠ బందోబస్తు : ఎస్పీ

పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేస్తున్నామని, 144 సెక్షన్ అమలులో ఉంటుదని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష కేంద్రాల సమీపంలో అన్ని జిరాక్స్ సెంటర్‌లు, ఇంటర్‌నెట్‌లు, లౌడ్ స్పీకర్లను బంద్ చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 500మీటర్ల వరకు ప్రజలు గుమి కూడవద్దన్నారు.

ముగిసిన ఇంటర్ సెకండియర్ పరీక్షలు

జిల్లా వ్యాప్తంగా ఇంటర్ సెకండియర్ పరీక్షలు గురువారం ముగిశాయి. ఇప్పటికే బుధవారం మొదటి సంవత్సరం పరీక్షలు ముగిశాయి. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు హాస్టళ్లను ఖాళీచేసి సొంత గ్రామాలకు బయలుదేరి వెళ్లారు. దీంతో బస్టాండ్ విద్యార్థులతో కిటకిటలాడింది.

సెమినార్‌తో జాతీయస్థాయి గుర్తింపు



సమావేశంలో మాట్లాడుతున్న ఎకనామిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నరేష్

మిర్యాలగూడ టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సెమినార్‌తో కేఎన్ఎం డిగ్రీ కళాశాలకు జాతీయస్థాయిలో గుర్తింపు లభించిందని ఎకనామిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్, సెమినార్ కన్వీనర్ డాక్టర్ నరేష్ గుమ్మడి అన్నారు. గురువారం స్థానికంగా విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇండియన్ కౌన్సిల్ ఫర్ సోషల్ సైన్స్ రీసెర్చ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సదస్సుకు 115 ప్రెజెంటేషన్స్ (రీసెర్చ్ ప్రాజెక్ట్) వచ్చాయన్నారు. అందులో వ్యవసాయం, నీటి పారుదల అంశాలపై అధిక ప్రాజెక్టులు రాగా, ద్వితీయ స్థానంలో ఐటీ రంగానికి సంబంధించిన అంశాలు ఉన్నాయన్నారు. దేశ నలుమూలల నుంచి వచ్చిన విద్యా నిపుణులు రాష్ట్రాభివృద్ధికి సంబంధించి పలు సూచనలు చేశారన్నారు. సెమినార్‌లోని అంశాలతో బుక్‌లెట్ రూపొందించి ఉన్నత విద్యామండలి, ఐసీఎస్ఎస్ఆర్‌కు సమర్పించనున్నట్టు తెలిపారు. అందరి సహకారంతో సెమినార్ విజయవంతం అయ్యిందన్నారు. సమావేశంలో కళాశాల అధ్యాపకులు త్రాసు వెంకటరమణ, రేఖారాణి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్య రంగాలను

విస్మరించిన రాష్ట్ర బడ్జెట్

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

నల్లగొండ రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రాధాన్య రంగాలను విస్మరించిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. గురువారం స్థానిక దొడ్డికొమరయ్య భవనంలో జరిగిన పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో అంకెలు కేటాయించాయి తప్ప, అవి ప్రజల అవసరాలకు అనుగుణంగా లేవన్నారు. అత్యంత ప్రాధాన్యరంగాలైనా విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమం, సాగునీరు, గ్రామీణ, పట్టణాభివృద్ధికి బడ్జెట్ కేటాయింపులు తక్కువగా ఉన్నాయన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, మహాలక్ష్మి పథకం, కొత్త అసరా పింఛన్లు, వ్యవసాయ కార్మికులకు ఆత్మీయ భరోసా పథకాలపై స్పష్టత లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై భారాలు మోపుతూ పెట్టుబడిదారులు, కార్పొరేటు శక్తులను లక్షల కోట్ల రూపాయల రుణాల నుంచి విముక్తులను చేస్తున్నాయని విమర్శించారు. ప్రజలకు బీజేపీ, కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసే వరకు ప్రజలతో కలిసి సమరశీల ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. తొలుత ఎస్ఎల్‌బీసీ సొరంగంలో మృతిచెందిన కార్మికులకు, ఇంజనీర్ల సంతాపం తెలిపారు. పార్టీ నేత తిరందాసు గోపి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, నాయకులు పాలడుగు నాగార్జున, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నారి అయిలయ్య, డబ్బికార్ మల్లేషం, బండ శ్రీశైలం, ప్రభావతి, సిహెచ్.లక్ష్మీనారాయణ, సయ్యద్ హాషం, వి.వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

59 కారుణ్య నియామక పోస్టుల భర్తీ

జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి

•7లో..

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రెవెన్యూ ఉద్యోగిపై ఆర్డీవో విచారణ

డిండి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ కార్యాలయ ఉద్యోగిపై ఆర్డీవో విచారణ నిర్వహించారు. 'అంతా అతని కనుసన్నల్లోనే' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' మినీలో ప్రచురితమైన కథనానికి దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి స్పందించారు. గురువారం ఆయన డిండి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగిపై విచారణ నిర్వహించారు. బాధితులు నేరుగా పిర్యాదు చేస్తే విచారణ జరిపి అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి వ్యాఖ్యలు అర్థరహితం

మిర్యాలగూడ టౌన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి వ్యాఖ్యలు అర్థరహితమని టీడీపీ ఓబీసీ విభాగం రాష్ట్ర నాయకుడు పోగుల సైదులుగౌడ్ అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ టీడీపీతో పొత్తుతో బీజేపీకి నష్టం వాటిల్లుతుందని రాకేష్ రెడ్డి పేర్కొనడం అవివేకమన్నారు. ప్రజల కోసం ఆవిర్భవించిన పార్టీ టీడీపీ అని, ఆ పార్టీతో మేలే తప్ప ఎవరికీ నష్టం జరగదన్నారు. ప్రచారం కోసం మాట్లాడటం సరికాదన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తాం

● అవంతీపురం మిషన్ భగీరథ గ్రిడ్ డీఈ ముజాహిద్ అన్వర్



వేసవిలో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు ప్రభుత్వం మూడు నెలల వేసవి యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేసింది. ఈ నేపథ్యంలో తాగునీటి సరఫరా ఏర్పాట్లపై అవంతీపురం మిషన్ భగీరథగ్రిడ్ డీఈ ముజాహిద్ అన్వర్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.
-(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ)

ఇంటర్వ్యూ Interview

ఆంధ్రజ్యోతి: చిట్యాల ఇంటెక్‌వెల్ నుంచి రోజుకు ఎంత నీటిని భగీరథ సరఫరాకు వినియోగిస్తున్నారు?

డీఈ: కృష్ణానదిపై చిట్యాల వద్ద నిర్మించిన ఇంటెక్‌వెల్‌పై 1005 హెచ్‌పి సామర్థ్యం కలిగిన 4ప్లస్2(స్పేర్) 6 మోటార్లను ఏర్పాటు చేసి 4 మోటార్ల ద్వారా కృష్ణా వాటర్‌ను రోజుకు అవంతీపురం 90 ఎంఎల్‌డి, ఇమాంపేట 95 ఎంఎల్‌డి సామర్థ్యం కలిగిన వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు 1.7 డయా పైపుల ద్వారా పంపింగ్ జరుగుతుంది. ఒక్కో మోటరు నిమిషానికి 30వేల లీటర్లను పంపింగ్ చేస్తాయి. ప్రతి ఏటా 1.5 టీఎంసీలు తాగు నీటికి వినియోగించడం జరుగుతుంది.

ఆంధ్రజ్యోతి: చిట్యాల నుంచి కృష్ణా నీటిని మిషన్ భగీరథ ద్వారా ఎన్ని గ్రామాలకు సరఫరా చేస్తున్నారు?

డీఈ: 50కిమీ పరిధిలోని అవంతీపురం ప్లాంట్ ద్వారా మిర్యాలగూడ నియోజకవర్గంలో 243 గ్రామాలు 55,603 ఇళ్లకు, హుజూర్‌నగర్ 107 గ్రామాల్లో 75,452ఇళ్లకు సరఫరా అవుతుండగా, 90 కి.మీ దూరంలోని ఇమాంపేట ప్లాంట్‌నుంచి సూర్యాపేట 226 గ్రామాల్లో 41,057 ఇళ్లకు, కోదాడ 170 గ్రామాల్లో 60,921 ఇళ్లకు మొత్తం 4 నియోజకవర్గాల్లోని 646 గ్రామాల్లో 2,33,033 ఇళ్లకు తాగునీరు సరఫరా చేస్తాం.

ఆంధ్రజ్యోతి: పెరుగుతున్న జనాభా భవిష్యత్ అవసరాలకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

డీఈ: ప్రస్తుత జనాభా పెరుగుదల నిష్పత్తి ప్రకారం 2033 వరకు ప్రతివ్యక్తికి రోజుకు 100 లీటర్లను సరఫరా చేసేవిధంగా నిర్మాణం చేపట్టారు. ప్రధాన పైపులైను ద్వారా వాటర్ ప్లాంట్‌కు నీటిని పంపింగ్ చేసి శుద్ధీకరణ జరిపి ఒవర్‌హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లకు (ఓహెచ్‌బీఆర్), అక్కడి నుంచి ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్‌లకు (ఓహెచ్‌ఎస్‌ఆర్)లకు సరఫరా చేసే పనులను గ్రిడ్ పర్యవేక్షిస్తుంది. అవంతీపురం నుంచి ఆరు లైన్ల ద్వారా ఓహెచ్‌ఎస్‌ఆర్‌లకు తాగునీటి పంపింగ్ చేస్తాం. అక్కడి నుంచి గ్రామాలు, మున్సిపాలిటీలలో ఇళ్లకు నీటిని సరఫరా చేసేపనిని ఇంట్రా ఆధ్వర్యంలో నిర్వహిస్తారు.

ధాన్యం పరిశ్రమలకు ప్రత్యేక విద్యుత్‌లైన్లు



మిల్లర్ల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ అర్బన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ధాన్యం పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అదనపు ఫీడర్ల నుంచి ప్రత్యేక విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. మిల్లర్స్ భవనంలో గురువారం జరిగిన సమీక్షా సమావేశంలో టీజీఎస్పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ భిక్షపతితో కలిసి పాల్గొన్నారు. ఆసియా ఖండంలోనే రైస్ ఇండస్ట్రీస్‌కు ప్రత్యేక గుర్తింపు ఉన్న మిర్యాలగూడ నియోజకవర్గంలో పరిశ్రమలకు ప్రత్యేక విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలన్న అంశాలపై అసెంబ్లీలో మాట్లాడినట్లు తెలిపారు. ప్రభుత్వం చర్చించి సానుకూలంగా స్పందించి ప్రత్యేక విద్యుత్ లైన్ల ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందన్నారు. డిమాండ్ తగిన విధంగా సరఫరాలో ఏర్పడుతున్న అవాంతరాలను నియంత్రించే సదుద్దేశంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. గతంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా ఉండేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. పారిశ్రామిక, వాణిజ్య, గృహవిద్యుత్ వినియోగంలో ఏర్పడే విద్యుత్ సమస్యను అధిగమించేందుకు విద్యుత్‌లైన్లను విభజించి విద్యుత్ సరఫరాలో మరింతనాణ్యత పెంచుతామన్నారు. అందుకు అవసరమైన అంచనా వ్యయంతో కూడిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడా కూడా కరెంటు సమస్య తలెత్తలేదని, రైతులు, ప్రజలు రోడ్డెక్కిన దాఖలాలు ఏమాత్రం లేవన్నారు. రాబోయే రోజుల్లో మెరుగైన సేవలందించేందుకు అధికారులు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని, తలెత్తిన సమస్యను సత్వరమే పరిష్కరించే విధంగా ఆయా కమిటీలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ అవసరాలకోసం నిత్యం వేలాదిమంది ప్రజలు పరిసర గ్రామాలనుంచి పట్టణానికి వస్తుంటారని, దీంతో ప్రధాన రహదారులపై ట్రాఫిక్ సమస్య తలెత్తుంతుందన్నారు. పరిష్కరించేందుకు రోడ్లకు ఇరువైపుల వ్యాపార లావాదేవీలు కొనసాగించే చిరువ్యాపారుల కోసం హనుమాన్‌పేట ఫ్లై ఓవర్ వంతెన దిగువన అన్ని వసతులతో మార్కెట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్రప్రతినిధులు కర్నాటి రమేష్, బండారు కుశలయ్య, మిర్యాలగూడ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, గంటా సంతోష్‌రెడ్డి, ఎస్ఈ వెంకటేశ్వర్లు, డీఈ శ్రీనివాసచారి, ఏడీఈలు రవీందర్‌రెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

మిర్యాలగూడలో ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గిస్తాం

మిర్యాలగూడ: మిర్యాలగూడ పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. హనుమాన్‌పేట సాగర్‌రోడ్డు ఫ్లైఓవర్ ప్రాంతాన్ని సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్, డీఎస్పీ రాజశేఖ ర్‌రాజుతో కలిసి గురువారం పరిశీలించారు. హౌసింగ్‌బోర్డు నుంచి ఫ్లైఓవర్ వరకు రోడ్డుపై ట్రాఫిక్ సమస్య ఉంద న్నారు. సాగర్‌రోడ్డుపై వీధి వ్యాపారుల తోపుడుబండ్లతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు అందుతున్నట్లు తెలిపారు. హనుమాన్‌పేట ఫ్లైఓవర్ కింద నున్న ఖాళీస్థలాన్ని ఫ్రూట్, వెజిటబుల్ మార్కెట్‌గా మలిచి తోపుడుబండ్ల వ్యాపారులను అక్కడికి తరలించాలని నిర్ణయించినట్లు, బైక్‌పార్కింగ్ కూడా ఏర్పా ట్లు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరిబాబు, మునిపల్ కమిషనర్ యూసూఫ్, ఎంపీడీవో శర్మ తదితరులు పాల్గొన్నారు.

కుందూరు లక్ష్మారెడ్డి మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు



నిడమనూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కుందూరు లక్ష్మారెడ్డి మృతి పార్టీకి తీరని లోటని సీఎల్పీ మాజీ నాయకుడు కుందూరు జానారెడ్డి అన్నారు. నిడమనూరుకు చెందిన లక్ష్మారెడ్డి అనారోగ్యంతో బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మృతిచెందారు. మండల కేంద్రంలోని లక్ష్మారెడ్డి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. అంతకుముందు మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు నివాళులర్పించారు. సంతాపం తెలిపినవారిలో నాయకులు కర్నాటి లింగారెడ్డి, మేరెడ్డి వెంకట్‌రాహుల్, అంకతి సత్యం, వల్లభ్‌రెడ్డి, రామేశ్వరిమట్టారెడ్డి తదితరులు ఉన్నారు.

ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలి

దేవరకొండ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు భయం, ఒత్తిడికి గురికాకుండా స్వేచ్ఛగా పరీక్షలు రాయాలని ఏఎస్పీ మౌనిక అన్నారు. యోగాపై జెడ్పీహెచ్ఎస్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. మానసిక ఒత్తిడిని జయించేందుకు నిత్యం మెడిటేషన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ నర్సింహులు, ఎంఈవో మాత్రునాయక్, ఎస్ఐలు కోటేష్, సతీష్, రాంమూర్తి ఉన్నారు.

ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఆంక్షలు ఎత్తివేయాలి

కొండమల్లేపల్లి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రభుత్వం విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని ఎస్ఎఫ్ఐ తెలంగాణ టెక్నికల్ రాష్ట్ర కో కన్వీనర్ రమావత్ లక్ష్మణ్‌నాయక్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమానికి కేంద్ర బిందువుగా ఉన్న ఉస్మానియా యూనివర్సిటీలో ఆంక్షలు విధించడం సబబు కాదన్నారు. సమావేశంలో నాయకులు శివ, సన్ని, అరవింద్, వేణు, మహేష్, అనిల్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

నీటిని వృథా చేస్తే నల్లా కనెక్షన్ తొలగిస్తాం

దేవరకొండ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మునిసిపాలిటీ పరిధిలోని ప్రజలు మిషన్‌భగీరథ నీటిని పొదుపుగా వాడుకోవాలని, నీటిని వృథా చేస్తే నల్లా కనెక్షన్ తొలగిస్తామని కమిషనర్ సుదర్శన్ హెచ్చరించారు. మునిసిపాలిటీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేవరకొండ పట్టణంలోని 20వార్డులకు మిషన్‌భగీరథ ద్వారా సరిపడా కృష్ణాజలాలు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే బాలునాయక్ సమావేశం ఏర్పాటు చేసి తాగునీటి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారన్నారు. పట్టణానికి సరిపడా కృష్ణానీటిని అందిస్తున్నట్లు తెలిపారు. దేవరకొండ పట్టణానికి ప్రతిరోజూ 45 లక్షల లీటర్ల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. మునిసిపాలిటీలో ఆస్తి పన్నులు వందశాతం వసూళ్లు చేయడమే లక్ష్యమన్నారు.

'లక్ష్యానికి మించి మార్కెట్ ఆదాయం'

నిడమనూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): లక్ష్యానికి మించి మార్కెట్ కమిటీకి ఆదాయం సమకూరిందని నిడమనూరు మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం తెలిపారు. గురువారం జరిగిన పాలకవర్గ సమావేశంలో మాట్లాడారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఫీజు రూపంలో మార్కెట్‌కు రూ.మూడు కోట్లు ఆదాయం సమకూర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, 2025 ఫిబ్రవరి మాసానికే రూ.3.16 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. 2025-26 సంవత్సరానికి బడ్జెట్ ప్రతిపాదనలు ఆమోదిస్తూ సమావేశంలో తీర్మానించారు. కమిటీ డైరెక్టర్ యాకూబ్ అలీ అకాల మరణం పట్ల సంతాపం తెలుపుతూ సమావేశంలో మౌనం పాటించారు. సమావేశంలో మార్కెట్ కార్యదర్శి తోట చందర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, మన్నెం శంకర్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే కేసులు



బయోమెట్రిక్‌ను పరిశీలిస్తున్న డీటీ

చింతపల్లి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం దందా చేస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఎం. రఘునందన్ హెచ్చరించారు. మండలంలోని కుర్మేడ్, వింజమూర్, వెంకటేశ్వరనగర్‌లోని రేషన్ దుకాణాలను గురువారం తనిఖీ చేశారు. లబ్ధిదారులకు రేషన్ బియ్యం అందించకుండా మోసాలకు పాల్పడితే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. రేషన్ బియ్యం లబ్ధిదారులకు అందించకుండా విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు.

ప్రభుత్వానిది చరిత్రాత్మక నిర్ణయం



నిడమనూరులో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తిరుమలగిరి(సాగర్), మార్చి 20(ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాలైన బీసీ, ఎస్సీలకు న్యాయం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం చట్టసభల్లో బిల్లులను ఆమోదించిందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమావత్ కృష్ణానాయక్, హాలియా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్ అన్నారు. ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్ల బిల్లు పెంపునకు సంబంధించిన బిల్లులు చట్టసభల్లో ఆమోదించడం పట్ల మండలకేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి చిత్రపటాలకు గురువారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో భాగంగా బీసీలకు రిజర్వేషన్లు పెంచడం, ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఎస్సీ వర్గీకరణ బిల్లుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలను నెరవేర్చిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రవణ్‌కుమార్‌రెడ్డి, సాయినాయుడు, మార్కెట్ డైరెక్టర్ రాములు, నాయకులు లాలు నాయక్, జబ్బార్, భాస్కర్‌రెడ్డి, నగేష్‌నాయక్, హచ్చునాయక్, అంజి, హరినాయక్, సర్దార్ నాయక్, నరేష్, గోపి, అక్రమ్ పాల్గొన్నారు.

పెద్దవూర: బీసీలకు 42శాతం రిజర్వేషన్ బిల్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లును రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మండలకేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పబ్బు యాదగిరిగౌడ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బిల్లుల ఆమోదానికి కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రులకు, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్ర మంలో హాలియా మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఊరె వెంకన్న, పులిమాల కృష్ణారావు, కాటేపల్లి వెంకటయ్య, కోట లక్ష్మయ్య, కిలారి మురళీయాదవ్, ఊరె సైదయ్య, కోట అంజి, ఊరె సైదులు, సైదులు, అంజిగౌడ్, మున్నా, ముని పాల్గొన్నారు.

నిడమనూరు: ఎస్సీ కులాల వర్గీకరణ, బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను అసెంబ్లీలో ఆమోదించడాన్ని హర్షిస్తూ మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంకతి సత్యం, మాజీ జడ్పీటీసీ నందికొండ రామేశ్వరిమట్టారెడ్డి, కొండా శ్రీనివాస్‌రెడ్డి, ఆలంపల్లి మైసయ్య, చర్క శ్రీను, కోట్ల సైదులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే బాలు



తక్కళ్లపల్లిలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

చింతపల్లి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి ప్రభుత్వ కృషిచేస్తోందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండలంలోని ఎం. మల్లేపల్లి, వీకే మల్లేపల్లి, కృష్ణరాయినిపల్లి, తక్కళ్లపల్లి గ్రామాల్లో రహదారులకు గురువారం శంకుస్థాపన చేశారు. వేసవి నేపథ్యంలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో మాల్ మార్కెట్ చైర్మన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్, మాజీ ఎంపీపీ కొండూరి భవాని పవన్‌కుమార్, ఎరుకల వెంకటయ్యగౌడ్, ముచ్చర్ల యాదగిరి, ఎంపీడీవో సుజాత, తహసీల్దార్ రమాకాంత్‌శర్మ, గుండ్లపల్లి అనిత నరసింహరెడ్డి, సత్తమ్మ పాల్గొన్నారు.

త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేయాలి

పెద్దఅడిశర్లపల్లి, మార్చి20(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు వేగవంతం చేసి త్రీఫేజ్ విద్యుత్ కరెంట్ ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కంబాలపల్లి ఆనంద్ డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని బూడిదగట్టు గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గిరిజన గ్రామాలకు త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఉద్దేశంతో యల్లాపురంలో 2023 లో 33/11కేవీ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేశారని, నిధులు లేకపోవడంతో సబ్‌స్టేషన్‌కు స్తంభాలు పాతి వదిలేశారన్నారు. గ్రామాల్లో త్రీఫేజ్ కరెంట్ లేకపోవడంతో వేరే ఫీడల్ చానల్ నుంచి రెండు రోజులకోసారి త్రీఫేజ్ ఇవ్వడంతో పంటలు ఎండిపోతున్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కావలి కృష్ణయ్య, హనుమ, మోతిలాల్, జాన్, సురేష్, శోక్లా, బాల్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సీసీరోడ్లు నిర్మించాలి



త్రిపురారం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దదేవులపల్లిలో మురుగుకాల్వలు, సీసీ రోడ్లు నిర్మించాలని సీపీఎం మండల కార్యదర్శి దైద శ్రీను అన్నారు. పోరుబాట కార్యక్రమంలో భాగంగా పెద్దదేవులపల్లిలోని 1, 3వ వార్డుల్లో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో సీసీరోడ్లు, మురుగుకాల్వలు లేక ఇళ్లలో నుంచి మురుగునీరు వీధుల్లో పారుతూ బురదగా ఏర్పడుతుందని అన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చందనబోయిన లక్ష్మయ్య, రామచంద్రు, సుధాకర్, చారగొండ అంజయ్య, శ్రీను, నాగయ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు రంగం సిద్ధం

(5వ పేజీ తరువాయి)

మాత్రమే ప్రభుత్వరంగ సంస్థలు కొనుగోలు చేశాయి. మిల్‌పాయింట్ల వద్ద సుమారు 8లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు జరిగింది. ఈ యాసంగి సీజన్‌లో నల్లగొండ జిల్లాలో 71, సూర్యాపేట జిల్లాలో 88 సన్నధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని పౌర సరఫరాలశాఖ అధికారులు నిర్ణయించారు.

సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులు

యాసంగి సీజన్‌లో ఇతర జిల్లాల నుంచి అనధికారికంగా ధాన్యం రాకుండా కట్టడి చేసేందుకు సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ప్రధానంగా సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో రెవెన్యూ, పోలీస్ అధికారులు సంయుక్తంగా చెక్‌పోస్టులు ఏర్పాటుకు ప్రాంతాలను గుర్తించారు. నల్లగొండ జిల్లాలోని నాగార్జునసాగర్, వాడపల్లి, సూర్యాపేట జిల్లాలోని మఠంపల్లి, కోదాడ ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు.

ప్రభుత్వరంగ సంస్థలకు భారీ లక్ష్యం

ఉమ్మడి జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వరంగ సంస్థలకు కలెక్టర్లు భారీ లక్ష్యం నిర్దేశించారు. ఇప్పటికే ప్రతిపాదిత కేంద్రాలను గుర్తించడంతోపాటు, కేంద్రాల్లో అవసరమైన టార్పాలీన్లు, టెంట్లు, తేమ కొలిచే యంత్రాలు, కాంటాలను అందుబాటులోకి తెచ్చేందుకు ఆదేశాలిచ్చారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 29.19 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రానుండగా, అందులో 26.76మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వరంగ సంస్థలు కొనుగోలు చేయాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించారు.

ప్రజలపక్షాన పోరాడేది కమ్యూనిస్టులే



ఎమ్మెల్సీ సత్యంను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్, సీపీఐ నాయకులు

దేవరకొండ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ప్రజలపక్షాన పోరాడేది కమ్యూనిస్టులేనని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన నెల్లికంటి సత్యంను నాయకులు దేవరకొండలో పార్టీ కార్యాలయంలో గురువారం సన్మానించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ పోరాడుతుందన్నారు. దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ మాట్లాడుతూ నెలికంటి సత్యం ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం అభినందనీయమన్నారు. ప్రజాసేవలో రాణించాలని కోరారు. ప్రభుత్వం బడుగు, బలహీనవర్గాలకు విద్య, ఉద్యోగ, రాజకీయ అవకాశాల్లో సమాన వాటా కోసం 42శాతం రిజర్వేషన్లు కల్పించేలా ప్రభుత్వం బిల్లు ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, పల్లా నర్సింహరెడ్డి, ఉజ్జిని రత్నాకర్‌రావు, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీను, పల్లె నర్సింహ, దేవేందర్‌రెడ్డి, శ్రవన్‌కుమార్, మైనొద్దిన్, రాంసింగ్, వీరస్వామి, పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేములపల్లి: ఎమ్మెల్సీగా ఎన్నికైన సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యంను మండలంలోని సీపీఐ మండల నాయకులు గురువారం నల్లగొండలో సన్మానించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జిల్లా యాదగిరి, జడ భీమయ్య, బుస్క పరమేష్, పాల్వాయి సుధాకర్, పెదపంగ ఆనంద్ తదితరులు ఉన్నారు.

దామరచర్ల: ఎమ్మెల్సీగా ఎన్నికైన నెల్లికంటి సత్యంను సీపీఐ మండల నాయకులు నల్లగొండలో సన్మానించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ధీరావత్ లింగానాయక్, పోలెపల్లి ఉదయ్‌కుమార్, ధీరావత్ శాంత, కోటయ్య ఉన్నారు.

వరదకాల్వ నీటిని విడుదల చేయాలి



రాస్తారోకోలో పాల్గొన్న సీపీఎం నాయకుడు అశోక్‌రెడ్డి, తదితరులు

మాడ్గులపల్లి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): వరదకాల్వ ద్వారా నీటిని విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు దేవిరెడ్డి అశోక్‌రెడ్డి డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అద్దంకి- నార్కట్‌పల్లి రహదారిపై గురువారం రాస్తారోకో నిర్వహించారు. వరదకాల్వపై కన్నెకల్, నారాయణపురం, దాచారం, మాడ్గులపల్లి, సీత్యాతండా, తోపుచర్ల వరకు వరదకాల్వపై ఆధారపడి ఉన్నారని రైతులు ఈ వరదకాల్వ మీద ఆధారపడి సాగు చేశారని తెలిపారు. వారం రోజులుగా వరదకాల్వ ద్వారా నీరందకపోవడంతో పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం దృష్టిసారించి ఏప్రిల్ 10 వరకు నీటి విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. ఈ విషయంపై అధికారులను సంప్రదించినా పట్టించుకోలేదని, నీటిని విడుదల చేయకపోతే రైతులతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు శ్రీకర్, దేవిరెడ్డి మల్లారెడ్డి, సీతారాంరెడ్డి, భూపతిరెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చారి, రాములు, మల్లయ్య, వెంకన్న ఉన్నారు.

విగ్రహ ఆవిష్కరణకు శాసనమండలి చైర్మన్ గుత్తాకు ఆహ్వానం

దేవరకొండ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): దేవరకొండలో ఏప్రిల్ 4న నిర్వహించే బంగారు గండిమైసమ్మ విగ్రహ ఆవిష్కరణ ప్రారంభోత్సవానికి రావాలని యాదవసంఘం నాయకులు నల్లగొండలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని కలిసి ఆహ్వానించారు. కార్యక్రమంలో దేవరకొండ యాదవసంఘం అధ్యక్షుడు నల్లగాసు విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ నల్లగాసు జాన్‌యాదవ్, నక్క వెంకటేష్‌యాదవ్‌లు కలిసి ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్‌రెడ్డిని యాదవసంఘం నేతలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో యాదవసంఘం నాయకులు శవ్వ వెంకటయ్య, రాములు యాదవ్, నేతాళ్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ

మిర్యాలగూడ టౌన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): సేవా భారతి ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవాభారతి ప్రముఖ్ ప్రీతంరాజు, కార్యక్రమంలో డాక్టర్ అంజయ్య, రామకృష్ణారెడ్డి, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా ఇస్కాన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆదిత్య ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వాల్యూ ఎడ్యుకేషన్ కాంటెస్ట్‌లో జిల్లాస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. కరస్పాండెంట్ మారుతి అమరేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు విలువలు నేర్పాలన్నారు.

కొనసాగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలు

చింతపల్లి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడుకొండ్ల కొండపైన లక్ష్మీ నరసింహ కల్యాణ వేడుకలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వైష్ణవ ఆచార సంప్రదాయ ప్రకారం పురోహితులు లక్ష్మీహయగ్రీవ హోమం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదంతో పాటు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వూరె శ్రీదేవి లక్ష్మణ్, ధర్మకర్తలు కోడిదూటి జంగయ్య, చేపూరి నారాయణాచారి, గడ్డం ఆంజనేయులు, మద్దెల కృష్ణగౌడ్, పూజారి పాండే పాల్గొన్నారు.